# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 25 ఆగస్టు 2026 పేజీలు : 8



# మాయమవుతున్న పురాతన రహదారులు

వ్యవసాయ పొలానికి వెల్లడానికి దారులు లేక రైతుల ఇబ్బందులు

కంచెలు వేసి కబ్జా చేసుకున్నా పట్టించుకోని అధికారులు



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** గ్రామీణ ప్రాంతాలలో పురా తన వ్యవసాయ పొలాలకు వెల్లే రహాదారులు కనిపించ డం లేదు. పానాధీ ( రహా దారి) లు అక్రమార్కుల క బ్జాలోకి వెళ్లిపోయాయి. అ ధికారుల నిర్లక్ష్యం, అసమ ర్థతల వల్ల కబ్జాకోరులు హ ద్దులు దాటుతున్నారు. పు రాతన రహదారిని కబ్జా చే సుకున్నారని పిర్యాదులు చే స్తున్నా అధికారులు పట్టిం చు కోవడం లేదనే ఆరో ప నలు ఎదుర్కొంటున్నారు. తన రహదారులను బయట తీయడానికి అధికారులు కూడా నా నా తంటాలు ప డుతున్నారు.

# వాంకిడి కేంద్రంలో అడ్డదిడ్డంగా ప్రైవేట్ స్కూల్ వాహానాలు

రహదారులపైనే బస్సుల నిలుపుదల..

విద్యార్థుల ఎక్కింపు, దింపులతో ట్రాఫిక్‌కు అంతరాయం

పాఠశాలల సమయాల్లో పెరుగుతున్న రద్దీ.. పట్టించుకోని యాజమాన్యాలు, అధికారులు

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా? అని ప్రశ్నిస్తున్న స్థానికులు



# వాంకిడి కేంద్రంలో అడ్డదిడ్డంగా ప్రైవేట్ స్కూల్ వాహనాలు

**రహదారులపైనే బస్సుల నిలుపుదల.. విద్యార్థుల ఎక్కింపు, దింపులతో ట్రాఫిక్‌కు అంతరాయం**

**పాఠశాలల సమయాల్లో పెరుగుతున్న రద్దీ.. పట్టించుకోని యాజమాన్యాలు, అధికారులు**

**ప్రమాదం జరిగాకే మేల్కొంటారా? అని ప్రశ్నిస్తున్న స్థానికులు**



**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల వాహనాల నిర్వహణపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు వినియోగించే బస్సులు, ఇతర వాహనాలను ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా నిలిపివేయడం తో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం పాఠశాల ప్రారంభ సమయం, సాయంత్రం పాఠశాల ముగిసే సమయంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోందని చెబుతున్నారు. పాఠశాల బస్సులు రహదారిపై నిలిపి విద్యార్థులను ఎక్కించడం, దింపడం చేస్తుండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాహనదారులు అంటున్నారు. రహదారి ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లో బస్సులు నిలిస్తే ఎదురెదురుగా వచ్చే వాహనాలకు మార్గం సరిగా లేక ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు.

**పాఠశాల బస్సులకే రహదారి అడ్డా?**

విద్యార్థుల కోసం నడిపే పాఠశాల బస్సులు ప్రజలకు ఇబ్బందిగా మారకూడదని, కానీ వాంకిడి కేంద్రంలో మాత్రం కొన్ని సమయాల్లో రహదారులే బస్సుల ఎక్కింపు దింపుల కేంద్రాలుగా మారుతున్నా యని స్థానికులు విమర్శిస్తున్నారు. బస్సులు ఎక్కడ ఆగాలి? విద్యార్థులను ఎక్కడ ఎక్కించాలి? ఎక్కడ దించాలి? అనే విషయాలపై పాఠశాల యాజమాన్యాలు స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాల ని కోరుతున్నారు.

**ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు**

ప్రధాన రహదారిపై బస్సులు అడ్డంగా నిలిచిన సమయంలో ద్విచక్ర వాహనదారులు బస్సులను దాటేందుకు ప్రయత్నిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా బస్సు పక్క నుంచి ఒక్కసారిగా విద్యార్థులు రహదారిపైకి రావడంతో ఇతర వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికే పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, అడ్డదిడ్డంగా నిలిపే పాఠశాల వాహనాలు సమస్యను మరింత పెంచుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఎక్కడ?**

పాఠశాల వాహనాల్లో చిన్నారులు ప్రయాణిస్తుండటంతో వారి భద్రత విషయంలో యాజమాన్యాలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. బస్సు ఆపే ప్రదేశం, విద్యార్థులు రహదారి దాటే పరిస్థితులు, పాఠశాల వద్ద ఏర్పడే రద్దీ వంటి అంశాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రత కోసం నడిపే వాహనాలే ఇతరులకు ప్రమాదకర పరిస్థితులు సృష్టించకూడదు అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

**నిబంధనలు ఉన్నా అమలు ఎక్కడ?**

ప్రైవేట్ పాఠశాల వాహనాల నిర్వహణపై నిబంధనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థ కంగా మారిందని స్థానికులు అంటున్నారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హత, వాహనాల భద్రతా ప్రమాణాలతో పాటు రహదారుల పై వాహనాలను నిలిపే విధానాన్ని కూడా అధికారులు పరిశీలించాల ని కోరుతున్నారు. పాఠశాల సమయాల్లో సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమస్యను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం వాహనాల పత్రాలను పరిశీలించడం కాకుండా విద్యార్థులను ఎక్కించే, దించే విధానం కూడా పరిశీలించాలని కోరుతున్నారు.

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు అవసరం**

వాంకిడి మండల కేంద్రంలో పాఠశాలలు అధికంగా ఉన్న ప్రాంతా ల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి బస్సుల పార్కింగ్, విద్యార్థుల ఎక్కింపు దింపుల కోసం ప్రత్యేక ప్రాంతాలను గుర్తించాలని సూచిస్తున్నారు. అవసరమైతే పాఠశాలల సమీపంలో కొంతసేపు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిపై బస్సులు ఎక్కువసేపు నిలిచే పరిస్థితిని నివారించాలని అంటున్నారు.

**ప్రమాదం జరిగేలోపు స్పందించాలి**

ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితులను అధికారులు ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించడం మంచిదని చెబుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, వాహనదారులు అందరి భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల వాహనాల రాకపోకలకు క్రమబద్ధమైన విధానం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. వాంకిడి కేంద్రంలో ప్రైవేట్ పాఠశాల వాహనాల అడ్డదిడ్డమైన నిలుపుదలను నియంత్రించి, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పాఠశాల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరిత పరిష్కారం

**క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీలతో కలిసి సోమవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావాల్సిన వాటాను ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. నస్పూర్ మున్సిపాలిటీ ప్రగతినగర్ వాసులు కాలనీలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. బెల్లంపల్లికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ కన్నెపల్లి మండలం పోలంపల్లి శివారులోని తమ భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లపై నమోదైందని, సవరించి తమ పేరుపై నమోదు చేయాలని కోరారు. లక్సెట్టిపేట మండలం ఊత్కూర్‌కు చెందిన తనుగుల సందీప్‌కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, జీవనోపాధి కల్పించాలని కోరారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఎం. ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వేమనపల్లి మండలం ముల్కలపేటకు చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో నమోదైందని, దానిని సవరించాలని కోరారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై భూమి పత్రాలు, విలువైన వస్తువులు, మంచాలు, బట్టలు కాలిపోయాయని, కుటుంబాన్ని నష్టపరిహారంతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ**





**మంచిర్యాల, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగుతోందని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన నాలుగు ఇందిరమ్మ ఇళ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేఖ లబ్ధిదారుల కుటుంబాలతో ఆప్యాయంగా మాట్లాడి, నూతనంగా నిర్మించిన గృహాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక కల మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆ కలను నిజం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. కొత్త ఇంటి తలుపులు తెరుచుకుని సొంత గృహంలోకి అడుగుపెడుతున్న వేళ లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు కొక్కిరాల సురేఖను శాలువాలతో ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, కొక్కిరాల సురేఖలకు లబ్ధిదారులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేటర్లు ఎంబడి కుమారస్వామి, తాళ్ల సంపత్ రెడ్డి, ఖలీద్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆటంకంగా మారిన టైగర్ జోన్ రద్దు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు




**జన్నారం,ఆగస్ట్24(ప్రజాజ్యోతి)** మండల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ ను శాశ్వతంగా రద్దు చేయాలని కోరుతూ సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాముల భూమాచారి బిజెపి నాయకుడు అజ్మీర బద్రీ నాయక్ లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రత్యేక అధికారికి ఫిర్యాదు అందచేశారు. అనంతరం రెండవ రోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ పులులు లేకున్నా టైగర్ జోన్ పేరిట మండల అభివృద్ధికి ఆటంకంగా మారిన టైగర్ జోన్ ను పూర్తిగా రద్దు చేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఏకో సెన్సిటివ్ జోన్ పేరుతో వ్యవసాయానికి యంత్రాలు వాడరాదు అంటూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు, గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు ఇసుక తీసుకురా నివ్వకుండా అటవీ శాఖ అధికారులు పెడుతున్న ఇబ్బందుల వల్ల ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సామాన్య మానవుడు నిర్మించుకుంటున్న ఇంటికి ఇసుక దొరకకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున మండల అభివృద్ధికి ఆటంకంగా మారిన టైగర్ జోన్ ను పూర్తిగా రద్దు చేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 41 రోజులు రిలే నిరాహార దీక్ష ఇలాగే కొనసాగుతుందని, అప్పటికి అటవీశాఖ అధికారులు స్పందించక పోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని హెచ్చరించారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి ని పరామార్శించిన శ్యాం నాయక్



**జన్నారం,ఆగస్ట్24(ప్రజాజ్యోతి)** జన్నారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్ ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్ సోమవారం లింగన్న గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లింగన్న గౌడ్ పరామర్శించిన వారిలో సదర్ మట్ సాధన సమితి అధ్యక్షులు హపావత్ రాజేందర్, జన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు రాజేష్ యాదవ్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు చిలువేరు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, కోశాధికారి శీల చంద్రశేఖర్ తదితరులున్నారు

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

### జీవో 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్




**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు, మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్వీ నాయకులు మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంచిర్యాల జాయింట్ కలెక్టర్ చంద్రయ్యకు జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నడిపెల్లి విజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. గతంలో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉండేదని, అయితే జీవో 97 అమలుతో ఇంజనీరింగ్ విద్యను కొనసాగించేందుకు మళ్లీ ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీంతో విద్యార్థులు అదనంగా సమయం కోల్పోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. డిప్లమో విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడకుండా తక్షణమే జీవో 97ను రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా చరిత్రలో బాగుపడ లేదని విజిత్ కుమార్ అన్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆగ్రహానికి గురైన జాతీయ స్థాయి నాయకులు రాజీనామాలు చేసిన సందర్భాలను ఆయన గుర్తుచేశారు. అదే విధంగా విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళితే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా విద్యార్థుల ఆగ్రహం తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి విద్యార్థులపై ఏమాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్నా వెంటనే జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యను పరిష్కరించకుండా జీవో 97ను అమలు చేస్తే ముఖ్యమంత్రి పదవికి సైతం ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రయ్యకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థులు, బీఆర్ఎస్వీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టీజీబీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, జిల్లా మీడియా కన్వీనర్ పల్లి రాకేష్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాలల్లో ఫీజులు చెల్లించాల్సిందిగా విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని, ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కొన్ని కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. పై చదువులు, ఉద్యోగాల కోసం సర్టిఫికెట్లు అవసరమైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. పుస్తకాలు, పెన్నులు పట్టుకుని కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు నేడు ప్లకార్డులు పట్టుకుని ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలను విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన మంచిర్యాల జిల్లాలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ జోన్ అధ్యక్షులు కుర్రె చక్రవర్తి, శ్రీరాంపూర్ జోన్ అధ్యక్షులు సత్రం రమేష్, కార్పొరేటర్ బొట్ల సత్యం, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల అశోక్ వర్ధన్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌సింగ్, బద్రి శ్రీకాంత్, ములకల్ల కుమార్, రెడ్డిమల్ల అశోక్, కొండా వెంకటేష్, పచ్చా వెంకటేశ్వర్లు, పరశురాం, సతీష్, సత్యనారాయణ, రవితేజ, చ. రవి, మణికంఠ, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాముని చెరువుపై లోకాయుక్త పోలీసుల విచారణ

**చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు**

**సమగ్ర నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తా**

**విచారణ అధికారి వెంకటరమణమూర్తి**



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువులో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై గతంలో బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు తెలంగాణ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం లోకాయుక్త పోలీసు అధికారులు రాముని చెరువును సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లోకాయుక్త విచారణ అధికారిగా వచ్చిన వసంశెట్టి వెంకటరమణమూర్తి రాముని చెరువులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. చెరువు మత్తడి కూల్చివేతలు, చెరువు మధ్యలో నిర్మించిన రహదారి, అక్రమంగా ఏర్పాటు చేసిన పార్కు ప్రాంతంతో పాటు ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారు తుల మధుసూదన్‌రావు మాట్లాడుతూ, రాముని చెరువును పూర్తిగా అన్యాక్రాంతం చేసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. చెరువు బఫర్‌జోన్‌లో అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని, ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గించి చెరువు భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, చెరువు పక్కన యథేచ్ఛగా మట్టి పోసి పూడ్చివేతకు పాల్పడుతున్నారని అధికారులకు ప్రత్యక్షంగా చూపించారు. రాముని చెరువు పరిరక్షణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విచారణ అధికారి వెంకటరమణమూర్తి స్పందిస్తూ, చెరువులో జరుగుతున్న అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తామని తెలిపారు. చెరువును పరిరక్షించే విధంగా నివేదిక ఉంటుందని, చట్ట పరిధిలోనే విచారణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. విచారణ అనంతరం లోకాయుక్త తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ అధికారి వెంకటరమణమూర్తి, బీజేపీ నాయకులు తుల మధుసూదన్‌రావు, హరికృష్ణ, నీటిపారుదల శాఖ డీఈ సృజన, ఏఈ హరికృష్ణ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏఐఎస్‌బీ నాయకులు

## విద్యార్థి రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## శక్తి స్కీమ్, జీవో 97 రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి




**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** విద్యార్థి రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఏఐఎస్‌బీ నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వం, అధికారుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట సన్నీ గౌడ్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని విద్యార్థి సమస్యల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించే శక్తి స్కీమ్, జీవో 97లను తక్షణమే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని కోరారు. మంచిర్యాల జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణ సమర్థవంతంగా సాగేందుకు ఖాళీగా ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులో వెంటనే రెగ్యులర్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాలకు సొంత పక్కా భవనాలను నిర్మించాలని కోరారు. విద్యార్థినులు, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలలకు సమీపంలోనే వసతి గృహాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, కాంపౌండ్ వాల్స్ తదితర కనీస మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకాన్ని ఏకం చేసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఏఐఎస్‌బీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు జతిన్ గౌడ్, నాయకులు సాయి చరణ్, మోహిన్, అఖిల్, రామ్ చరణ్, ఈశ్వర్, అశ్వంత్, ఓంకార్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మధునయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం



**జైపూర్ ఆగస్టు 24 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు దుర్గం మధునయ్య 3వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.మధునయ్య జ్ఞాపకార్థం మాతా శిశు ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురికి భోజనాలు అందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మధునయ్య తమ మధ్య భౌతికంగా లేకపోయినా ఆయనతో ఉన్న అనుబంధం జ్ఞాపకాలు ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచిపోతాయని తెలిపారు.ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయనను స్మరించుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.ఆపదలో ఉన్నవారికి, అవసరమైన వారికి తమవంతు సహాయం చేయాలనే మంచి ఆలోచనతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మాతా శిశు ఆసుపత్రి వద్దకు వచ్చే రోగులు వారి సహాయకులు ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న పలువురు ఈ అన్నదాన కార్యక్రమంలో భోజనాలు స్వీకరించారు. కుటుంబ సభ్యులు స్వయంగా భోజనాలను వడ్డిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.కీర్తిశేషులు మధునయ్య ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దుర్గం సుగుణ,దుర్గం శ్యామ్‌కుమార్,సల్లూరి శ్రీకాంత్,శ్రవణ్‌కుమార్, నవీన్,చిరంజీవి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో సాధారణ స్థాయిలో వర్షపాతం

**వేమనపల్లిలో అత్యధికంగా 32.1 మి.మీ. వర్షం**

**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలో గత 24 గంటల్లో పలు మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లాలో నిన్నటి సగటు వర్షపాతం లి11.6 మి.మీ.లిగా నమోదైంది. సాధారణ వర్షపాతం 8.9 మి.మీ.తో పోలిస్తే ఇది 30 శాతం అధికంగా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 719.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 701.2 మి.మీ. కాగా, సీజన్ మొత్తంగా వర్షపాతం3 శాతం అధికంగా నమోదై సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. నిన్న అత్యధికంగా వేమనపల్లి మండలంలో 32.1 మి.మీ., బెల్లంపల్లిలో 23.3 మి.మీ., కాసిపేటలో 20.3 మి.మీ., మందమర్రిలో 18.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేమనపల్లిలో సాధారణం కంటే 352 శాతం, బెల్లంపల్లిలో 100 శాతం, కాసిపేటలో 101 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక అత్యల్పంగా తాండూరు మండలంలో 0.8 మి.మీ., మంచిర్యాల మండలంలో 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాండూరులో సాధారణం కంటే 89 శాతం, మంచిర్యాలలో 78 శాతం తక్కువగా వర్షం కురిసింది. సీజన్ మొత్తంగా చూస్తే జిల్లాలో 3 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వీటిలో కాసిపేట, బెల్లంపల్లి, మంచిర్యాల మండలాలు ఉన్నాయి. 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుండగా, జన్నారం, లక్సెట్టిపేట, హాజీపూర్, తాండూరు, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల, మందమర్రి, నస్పూర్, జైపూర్, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాలు సాధారణ స్థితిలో ఉన్నాయి. దండేపల్లి మండలంలో మాత్రమే వర్షపాతం లోటు నమోదైంది. జిల్లా మొత్తం మీద వర్షపాతం పరిస్థితి ప్రస్తుతం సాధారణ స్థాయిలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అత్యధికంగా బెల్లంపల్లి మండలంలో 945.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు .

# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఆగస్టు 24:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో కూడి, సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, విద్యాభ్యాస సామర్థ్యం పెంపొందుతుందని కలెక్టర్ తెలిపారు. అల్పాహారం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్దేశిత సమయానికి విద్యార్థులకు అందేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మహాధర్నా

### 27న మహాధర్నాను విజయవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 27న ఐడీఓసీ నస్పూర్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేసేందుకు మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో సోమవారం పలు శాఖల్లో ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, వివిధ శాఖల ప్రతినిధులతో కలిసి ఐడీఓసీ, ఇరిగేషన్ శాఖ, ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా అటవీశాఖ కార్యాలయాల్లో పర్యటించి మహాధర్నాకు ఉద్యోగులను సమీకరించడంపై చర్చించారు. అనంతరం ప్రాథమిక సభ్యులు, జేఏసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 27న ఐడీఓసీ నస్పూర్‌లో నిర్వహించనున్న మహాధర్నాలో అటెండర్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఉద్యోగి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లపై మహాధర్నాలో గళమెత్తనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశాల్లో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ పర్వతి సత్యనారాయణ, మంచిర్యాల జేఏసీ కో–చైర్మన్లు శ్రీనివాస్ రావు, దేశ్‌పాండే, బట్టారి వెంకటేశ్వర్లు, సుమిత్, పుప్పాల హనుమంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, దుర్గా ప్రసాద్, భూముల రామ్మోహన్, పత్తి సత్తయ్య, డిప్యూటీ చైర్మన్ బొడ్డు శ్రావణ్ కుమార్, సుధాకర్, వైస్ చైర్మన్లు సూరినేని గంగాధర్, ఒడిగ కృష్ణ, బి. రవీందర్, ఎస్. కిషన్, ఏ. సునీత, నాగుల గోపాల్, పబ్లిసిటీ సెక్రటరీ రాంకుమార్, సెక్రటరీలు సత్యనారాయణ, తిరుపతి, రాంకుమార్, వెంకటేష్, రోశయ్య, జ్యోతి, చంద్రశేఖర్ రెడ్డి, ఏ. రాజేందర్తో పాటు టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బూరస పోచయ్యకు ఘన సన్మానం



**ఆసిఫాబాద్ ఆగష్టు 24 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ సంఘం జాయింట్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బూరస పోచయ్యను రాజంపేట పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పోచయ్య నాయకత్వంలో సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామాల సర్వాంగీణ అభివృద్ధి కోసం మరింత బలంగా ముందుకు సాగాలని పాలకవర్గం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావిద్, ఉపసర్పంచ్ మామిడి లక్ష్మీ, వార్డు సభ్యులు బొట్టుపల్లి లావణ్య, త్రిశూల నానయ్య, కొమరం వేణు, బుర్సా భూపతి పాల్గొన్నారు. అలాగే పంచాయతీ సెక్రటరీ సాయి కృష్ణ, బిల్ కలెక్టర్ నాగేంద్ర, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌లతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## శ్రీరాంపూర్ ఓసీపీలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల నియామకం



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఓసీపీలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల నియామక ప్రక్రియను శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకత్వం ఆధ్వర్యంలో పిట్ కమిటీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగం వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా బేర శ్రీకాంత్, ఎలక్ట్రికల్ విభాగం వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. నియామక పత్రాలను శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజులకు అందజేశారు. అనంతరం నూతనంగా నియమితులైన వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లను అధికారులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోతుకూరి కొమురయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ సెక్రటరీ లచ్చన్న, అసిస్టెంట్ సెక్రటరీ సత్తయ్య, అధికార ప్రతినిధి సతీష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ (మైనింగ్) శ్రీనివాస్, పెద్దన్నతో పాటు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లుగా నియమితులైన బేర శ్రీకాంత్, శ్రీనివాస్‌లకు యూనియన్ నాయకులు, ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు కీలక పాత్ర పోషించాలని, కార్మికులకు మరియు యాజమాన్యానికి మధ్య సమన్వయంతో పనిచేస్తూ కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి



**దండేపల్లి, ఆగస్టు, 24 దండేపల్లి :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉపాధ్యాయుల బతుకులు మారుతాయని ఆశించామని, అయితే ప్రభుత్వాలు మారుతున్నా ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పిఆర్‌సి నివేదికను ప్రభుత్వం తెప్పించుకుని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో 3 డిఎలు పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం 6 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. గడిచిన రెండేళ్ల నుంచి నిలిచిపోయిన జిపిఎఫ్, టిఎస్‌జిఎల్ఐ, డిఎ అరియర్స్ లాంటి బకాయిలను వెంటనే చెల్లించేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. పిఆర్‌సిని వెంటనే అమలు చేయకపోతే తపస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకుని సంఘానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యంశాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణచారి, నాయకులు బి. ఉమా, దార రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కర్రల దుకాణాల ముసుగులో మద్యం దందా.. అధికారుల నిఘా ఎక్కడ?

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో కొన్ని కర్రల దుకాణాలు, చిన్నచిన్న వ్యాపార కేంద్రాల ముసుగులో అనధికారికంగా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సాధారణ వ్యాపార దుకాణాల మాదిరిగా కనిపించే కొన్ని చోట్ల సాయంత్రం తర్వాత మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ మాత్రం జరగాల్సి ఉంది. స్థానికుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. సరండి, నార్లాపూర్ గ్రామాలకు పోయే రహదారి,ఓ ప్రైవేట్ స్కూల్ మండలంలోని వైన్‌షాపు నుంచి మద్యం బాటిళ్లు ఇతర ప్రాంతాలకు తరలుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి వాంకిడి మండల కేంద్రంలోని కొన్ని దుకాణాలకు మద్యం చేరుతోందన్న ప్రచారం ఉంది. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### సాధారణ దుకాణాలా.. మద్యం కేంద్రాలా?

మండల కేంద్రంలో కొన్ని దుకాణాలు బయటకు చూస్తే సాధారణ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లుగా కనిపిస్తున్నాయని, అయితే రాత్రి వేళల్లో అక్కడ మద్యం అందుబాటులో ఉంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారికంగా మద్యం విక్రయించే అనుమతి లేకున్నా మద్యం విక్రయిస్తే అది నిబంధనలకు విరుద్ధమని స్థానికులు చెబుతున్నారు. అసలు ఏ దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి? అక్కడ మద్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? ఎంత మొత్తంలో మద్యం నిల్వ చేస్తున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

### ఆ మద్యం షాపు నుంచే సరఫరా?

వాంకిడి మండల కేంద్రానికి సమీపంలోని సరండి, నార్లాపూర్ గ్రామాలకు పోయే రహదారి, ఓ ప్రైవేట్ స్కూల్ మండలంలోని వైన్ షాపు నుంచి మద్యం తరలిస్తున్నారన్న ఆరోపణలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. వైన్‌షాపుల నుంచి బయటకు వెళ్తున్న మద్యం ఎక్కడికి చేరుతోంది? అధికారిక బిల్లులతోనే విక్రయాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు రికార్డులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. మద్యం సరఫరా గొలుసులో ఎవరి పాత్ర ఉందో తేల్చేందుకు వైన్‌షాపుల విక్రయ రికార్డులు, స్టాక్ వివరాలు, రవాణా వ్యవహారాలను పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

### రాత్రివేళల్లో నిఘా అవసరం

అనధికారిక మద్యం విక్రయాలు సాధారణంగా రాత్రి వేళల్లో జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉండటంతో ఆ సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పగటిపూట సాధారణంగా కనిపించే ప్రాంతాల్లో సాయంత్రం తర్వాత అకస్మాత్తుగా జనసంచారం పెరగడం, ద్విచక్ర వాహనాల రాకపోకలు కొనసాగడం వంటి అంశాలపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు

అనధికారికంగా మద్యం విక్రయిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు భిన్నంగా అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అత్యవసర సమయంలో మద్యం కావాల్సిన వారికి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తు న్నాయి. దీనిపై అధికారులు తనిఖీలు నిర్వహించి నిజానిజాలను తేల్చాలని కోరుతున్నారు.

### ప్రజల భద్రతపై ప్రభావం

మద్యం అనధికారికంగా అందుబాటులో ఉంటే ప్రజా శాంతిభద్రతలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల సమీపంలో మద్యం సేవించే వారి వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### యువతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?

మండల కేంద్రంలోని చిన్నచిన్న దుకాణాల వద్ద మద్యం సులభంగా లభిస్తే యువతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మద్యం విక్రయాలకు నిర్దిష్ట నియమాలు, అనుమతులు ఉన్నప్పటికీ వాటిని పక్కన పెట్టి ఎవరైనా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### వైన్‌షాపుల రికార్డులు పరిశీలిస్తే..

ఆ వైన్‌షాపు నుంచి వాంకిడి మండల కేంద్రానికి మద్యం సరఫరా



అవుతోందన్న ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో తెలుసుకోవాలంటే సంబంధిత వైన్‌షాపుల స్టాక్, విక్రయ రికార్డులు, బిల్లులు, రోజువారీ లెక్కలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అక్రమంగా మద్యం తరలింపు జరిగిందా లేదా అన్నది విచారణలో తేలే అవకాశం ఉంది.

### అధికారుల తనిఖీలపై ప్రజల ఎదురుచూపు

మండల కేంద్రంలో అనధికారిక మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం ప్రధాన వైన్‌షాపుల వద్ద తనిఖీలకే పరిమితం కాకుండా చిన్న దుకాణాలు, కర్రల దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాలపై కూడా నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమ మద్యం'కు అడ్డుకట్ట పడేనా?

మండల కేంద్రంలో అక్రమ మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలకు అధికారులు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే మద్యం ఎక్కడి నుంచి వస్తోంది, ఎవరు సరఫరా చేస్తున్నారు, ఎవరు విక్రయిస్తున్నారు అనే పూర్తి వ్యవహారాన్ని బయటకు తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు, సరండి, నార్లాపూర్,ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో ఉన్న,మండలంలోని వైన్‌షాపు నుంచి వాంకిడి కేంద్రానికి మద్యం సరఫరా అవుతోందన్న ఆరోపణలు కూడా అధికారులు విచారించాల్సిన అంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఎప్పుడు స్పందిస్తుంది? ఆకస్మిక తనిఖీలు ఎప్పుడు చేపడుతుంది? ఆరోపణల్లో వాస్తవం ఉందో లేదో అధికారులు ఎప్పుడు వెల్లడిస్తారు? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**గమనిక...?**

పై కథనంలోని అక్రమ మద్యం విక్రయాలు, సరఫరాకు సంబంధించిన అంశాలు స్థానికుల నుంచి అందిన ఆరోపణలు, సమాచారంగా మాత్రమే పేర్కొనబడ్డాయి. సంబంధిత అధికారులు విచారణ, అధికారిక నిర్ధారణ అనంతరం వాస్తవాలు స్పష్టమవుతాయి.

# యంత్రాలను పకడ్బందీగా నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**12 టన్నుల క్రేన్‌ను ప్రారంభించిన శ్రీరాంపూర్ ఏరియా జీఎం**

**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో నూతనంగా కేటాయించిన 12 టన్నుల క్రేన్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. శ్రీరాంపూర్ ఉపరితల గని హెచ్‌ఈఎం సెక్షన్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న జీఎం క్రేన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాకు ఎస్ఆర్‌పీ ఓసీపీ గుండెలాంటిదని అన్నారు. ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంతో పాటు ఏరియా ఉత్పత్తి సాధనలోనూ ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర ఏరియాల్లో పక్కన పెట్టిన బీఈఎంఎల్ డంపర్లతో పాటు ఇతర భారీ యంత్రాలను వినియోగించి బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ తొలగింపులోనూ ఎస్ఆర్‌పీ ఓసీపీ ఉద్యోగులు మంచి ఫలితాలు సాధించారని అభినందించారు. నూతనంగా కేటాయించిన క్రేన్‌ను కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యంత్రాలను దుర్వినియోగం చేయకుండా, పాడవకుండా పకడ్బందీ నిర్వహణ చేపట్టాలని, నూటికి నూరు శాతం సామర్థ్యంతో వినియోగించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. మెటీరియల్స్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇతర అవసరమైన వసతులను త్వరలోనే కల్పిస్తామని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తూ సంస్థ అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోతుకూరి కొమురయ్య, ఎస్ఆర్‌పీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, మేనేజర్ ఐ. శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ సురేష్,



ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, ఇంజనీర్ శ్రీకాంత్, సంక్షేమ అధికారి ఓంకారి బాబు, పిట్ సెక్రటరీ మోతె లచ్చన్న, గుర్తింపు సంఘం ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనం లోపించిందా..? అందుబాటులో లేని 4వ వార్డు సభ్యురాలు

సరండి గ్రామపంచాయతీలో గుసగుసలు




**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ 4వ వార్డు సభ్యురాలు మహేశ్వరి వ్యవహారశైలిపై స్థానికంగా పలు గుసగుసలు వినిపిస్తున్నాయి. వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసు కుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి న ప్రజాప్రతినిధి తరచూ అందుబాటులో ఉండ డం లేదనే అభిప్రాయాలు స్థానికుల్లో వ్యక్తమవు తున్నాయి. వార్డు పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై ప్రజలు తమ ప్రతినిధిని సంప్రదించాల్సిన అవసరం ఉంటుందని, అయితే పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆమె స్పందన లభించడం లేదని కొందరు స్థానికులు పేర్కొంటున్నట్లు సమాచారం. మీడియా ప్రతినిధులు కూడా వివరణ కోసం సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఎన్నుకున్న వార్డు సభ్యులు తమ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండటం, సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం బాధ్యతగా భావిస్తారు. ఈ నేపథ్యంలో 4వ వార్డు సభ్యురాలు మహేశ్వరి ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె అందుబాటులో లేకపోవడానికి గల కారణాలు ఏమిటన్నది తెలియాల్సి ఉంది. ఈ ఆరోపణలపై మహేశ్వరి స్పందన లభించాల్సి ఉంది. ఆమె వివరణ వెలువడితే వార్తలో ప్రచురించేందుకు అవకాశం ఉంటుంది.ప్రజాప్రతినిధి అందుబాటులో ఉంటేనే ప్రజల సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు పడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

బాధితులకు భరోసా కల్పించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పెద్దపల్లి జిల్లాల ప్రజల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా హాజరై ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలను సేకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిగణనలోకి తీసుకున్న సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీపీ తెలిపారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ఎలాంటి ఆలస్యం లేకుండా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల ని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే టీఎన్జీవో లక్ష్యం

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి




**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి అన్నారు. నస్పూర్‌లోని ఐడీఓసీలో టీఎన్జీవో నూతన జెండా, కండువాలను ఆయన ఘనంగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ టీఎన్జీవో నూతన జెండా, కండువాలను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర సంఘం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో చర్చిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలోని ప్రతి నాన్ గెజిటెడ్ ఉద్యోగి టీఎన్జీవోలో సభ్యత్వం తీసుకోవాలని శ్రీహరి పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, జిల్లా, కేంద్ర సంఘాలకు ఉద్యోగులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, తిరుపతి, రామ్‌కుమార్, సత్యనారాయణ, నరేందర్, సంయుక్త కార్యదర్శులు సునిత, అంజయ్య, కార్తీక్, ప్రభు, పద్మలత, సురేందర్, రోశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, పబ్లిసిటీ సెక్రటరీ యూసుఫ్, స్పోర్ట్స్ సెక్రటరీ కుమార్, కార్యవర్గ సభ్యులు రాజేందర్, జ్యోతి, వివిధ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాముని చెరువు వాకర్స్‌ను కోతుల బారి నుంచి రక్షించండి

### స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు వాకర్స్ సభ్యుల విజ్ఞప్తి



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రం లోని రాముని చెరువు కట్టపైకి గుంపులు గుంపులుగా కోతులు, వానర సైన్యం వస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వందలాది మంది మహిళలు, పురుషులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని రాముని చెరువు వాకర్స్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ వైపు నుంచి కోతులు వచ్చి దాడి చేస్తాయోనన్న భయంతో వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంద న్నారు. గతంలో కూడా రాముని చెరువు కట్టపై కోతులు కొందరు వాకర్స్‌పై అకస్మాత్తుగా దాడి చేసి గాయపరిచిన సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కోతుల భయంతో కొందరు వాకర్స్ రాముని చెరువు కట్టపై వాకింగ్‌కు రావడమే మానుకుంటున్నారని తెలిపారు. రాముని చెరువు కట్టపై వాకర్స్ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కోతులు అక్కడికి రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను వారు కోరారు. కోతుల బెడద నివారణకు గతంలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో రూ.15 లక్షలు కేటాయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తమకు సమాచారం ఉందని తెలిపారు. ఆ నిధులను వినియోగించి పట్టణంలోకి, ముఖ్యంగా రాముని చెరువు కట్టపైకి కోతులు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వాకర్స్‌కు ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి కోతుల సమస్యను పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా రాముని చెరువు వాకర్స్ సభ్యుడు, అధ్యక్షుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మరియు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక గజెల్లి వెంకటయ్య కోరారు.

# అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలు

జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్



**మంచిర్యాల, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం, మాదకద్రవ్యాల బారిన పడిన వారికి చికిత్స, పునరావాసం అందించడం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద మంచిర్యాల జిల్లాలో డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు అర్హత కలిగిన ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు, వాటికి బానిసైన వారికి అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. అర్హత, ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు ఈ-అనుదాన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన ఇతర వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగు ల, వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ, రూమ్ నంబర్ జీ-1, కలెక్టర్ కార్యాలయం, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, మంచిర్యాల వద్ద సంప్రదించాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు బాధితులకు చికిత్స, పునరా వాసం అందించడంలో భాగంగా జిల్లాలో డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు కోసం అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

# శ్రీరాంపూర్ సీహెచ్‌పీ రైల్వే సైడింగ్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

## జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు



**మంచిర్యాల, 24,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్‌లోని సీహెచ్‌పీ రైల్వే సైడింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులందరికీ ప్రతి నెల 7వ తేదీలోపు జీతాలు చెల్లించాలని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయడంలో స్థానిక యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న పరిస్థితుల్లో జీతాలు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైల్వే సైడింగ్ కాంట్రాక్టర్‌కు కాంట్రాక్టు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క నెల కూడా 10వ తేదీలోపు జీతాలు చెల్లించలేదని, ప్రతి నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జీతాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు అందించాల్సిన భద్రతా సామగ్రి, వర్షపు కోట్లు కూడా ఇప్పటి వరకు అందించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి ప్రతి నెల 10వ తేదీలోపు జీతాలు చెల్లించేలా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కాతరాజు ప్రభాకర్, నాయకులు వెంకటస్వామి, ప్రశాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువలు కబ్జా.. రోడ్లపై మురుగునీరు!

మందమర్రి మార్కెట్‌లో ప్రజల అవస్థలు

-- ప్రజావాణిలో టీడీపీ వినతి



**మందమర్రి టౌన్, ఆగస్టు 24 ప్రజా జ్యోతి:** మందమర్రి పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో కాలువల ఆక్రమణలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. మార్కెట్ సెంటర్‌లోని అజయ్ క్లాత్ స్టోర్ నుంచి రామకృష్ణ మెడికల్ స్టోర్ వరకు గతంలో ఉన్న కాలువలు ఆక్రమణలకు గురై, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపైనేనిలిచిపోతున్నాయని,దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. ముఖ్యంగా రోడ్డుపై నిలిచిన నీటిలో వాహనాలు ప్రయాణించే సమయంలో పాదచారులు, దుకాణాల వద్ద ఉన్న ప్రజలపై మురుగునీరు చిమ్ముతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మార్కెట్ ప్రాంతంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని టీడీపీ నాయకులు విమర్శించారు. కాలువల ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు, గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి మార్కెట్ ప్రాంతంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై సోమవారం ప్రజావాణి కార్యక్రమం లో సంబంధిత నోడల్ అధికారికి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సమస్యను పరిశీలించి కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్, రాష్ట్ర నాయకులు ఎం.డి. షరీఫ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, ఉపాధ్యక్షులు వడ్లాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగణనతోనే న్యాయం!

### జనాభా లెక్కలేసి రిజర్వేషన్లు పెంచాలి

### కలెక్టరేట్ లో వినతిపత్రం ఇచ్చిన బీసీ సంఘాల నేతలు



**ఆసిఫాబాద్ ఆగస్టు 24 ప్రజా జ్యోతి** బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూపునార్ రమేష్ డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీల వాస్తవ జనాభా తెలియకుండా న్యాయం జరగదని, అందుకే కేంద్రం చేపట్టే జనగణనలో బీసీల కులాల వారీగా లెక్కలు తీయాలని అన్నారు. బీసీ కుటుంబాలన్నీ నమోదయ్యేలా ప్రత్యేక కాలమ్ పెట్టాలని, శాస్త్రీయంగా, పారదర్శకంగా గణన చేపట్టాలని కోరారు.జనాభా లెక్కల ఆధారంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు రావాల్సిన వాటా ఇవ్వాలని, రాజ్యాంగబద్ధ హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్న రమేష్, ఆరే సంఘం జిల్లా అధ్యక్షులు బొట్టుపల్లి జయరాం, రైతు సంఘం అధ్యక్షులు వైరాగడే మారుతీ, బొట్టుపల్లి ప్రశాంత్, ఇందురి తిరుపతి, సిరికొండ సాయి కృష్ణ, దానపల్లి శంరావ్, కుందారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల సంక్షేమసమావేశంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** తెలంగాణ శాసనసభ ఆవరణలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ఎస్సీ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ ప్రాథమిక సమావేశంలో సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఖానాపూర్ శాసనసభ్యులు వెద్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాలు ఎదుర్కొంటున్న సమస్యల పై జిల్లాల వారిగా కమిటీ తిరిగి అభిప్రాయ సేకరణ చేయాలని,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు అవుతున్న తీరు వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని,ఎస్సీ–ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నివేదిక,బ్యాంకు రుణాల మంజూరు, మరియు వార్షిక బడ్జెట్ తదితర అంశాల పైన అధ్యయనం చేయాలని చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ఎమ్మెల్యేలు నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, ఎంఎల్సీలు బసవరాజు సరయ్య,శ్రీ మైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏసీబీ అధికారుల మెరుపుదాడులు పట్టుబడ్డ వాణిజ్య శాఖ అధికారులు



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 24 ,( ప్రజాజ్యోతి )** నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో సంబంధిత ఇద్దరు అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిసింది. ఓ వ్యాపారి తాను ఏటా చెల్లించే పన్నులో కొంత మినహాయింపు కోసం అధికారులను అభ్యర్థించారు, దీనిని అదనుగా చేసుకున్న డి సి టి ఓ గోదావరి సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణ బేరాన్ని కుదుర్చుకోవడానికి ప్రయత్నించారు. నచ్చని వ్యాపారి వీరిని ఎలాగైనా ఏసీబీకి పట్టించాలని సంబంధిత అధికారులను సంప్రదించారు, ఏసీబీ అధికారుల సూచన మేరకు వారు కుదుర్చుకున్న లంచాన్ని ఆ శాఖ కార్యాలయంలో ఇద్దరు అధికారులకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఏసీబీ అధికారుల విచారణ అనంతరం తెలియాల్సి ఉంది

**అలర్ట్ అయిన కార్యాలయాలు**


నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి వాణిజ్య వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఇద్దరు అధికారులను రెడ్డాండెడ్గా పట్టుకున్నారు. ఈ ఘటనతో నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల ప్రభుత్వ కార్యాలయాల అధికారులు భయాందోళనకు గురయ్యారు అవినీతి ఆరోపణ తమను చుట్టుముట్టుకొని ఆ వలలో పడవేస్తుందేమోనని వణికిపోయారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి. ఇక అవినీతి సొమ్ము జోలికి పోవాలంటేనే భయం కలిగేలా ఈ ఘటన అధికారులను విస్మయానికి గురిచేసింది.

# వార్తకు స్పందన.. రేషన్ బియ్యం పంపిణీ షురూ

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):**మూడు నెలల రేషన్ బియ్యం ఎప్పుడు ఇస్తారు..?అంటూ సరండి గ్రామ రేషన్ కార్డుదారులు ఎదురుచూస్తున్న పరిస్థితిపై ప్రజాజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. కథనం వెలువడిన అనంతరం అధికారులు చర్యలు చేపట్టి సోమవారం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. దీంతో నెలల తరబడి బియ్యం కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట లభించింది. కొంతకాలంగా రేషన్ బియ్యం సరఫరా సక్రమంగా లేకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోయారు. ప్రతి నెలా ప్రభుత్వం అందించే బియ్యం పైనే ఆధారపడే కుటుంబాలు సకాలంలో సరుకులు అందక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం ఎప్పుడు వస్తాయని అడిగితే సరఫరా కాలేదనే సమాధానమే వస్తుండడంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన ప్రజాజ్యోతి ప్రజల తరఫున గళం వినిపిస్తూ "మూడు నెలల రేషన్ బియ్యం ఎప్పుడు..?" అనే కథనాన్ని ప్రచురించింది. బియ్యం పంపిణీలో నెలకొన్న జాప్యాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత యంత్రాంగం స్పందించింది. తాజాగా బియ్యం అందుబాటులోకి రావడంతో రేషన్ కార్డుదారులకు పంపిణీ ప్రారంభమైంది.

**కథనానికి స్పందన.. ప్రజల్లో హర్షం**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తే సంబంధిత అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టవచ్చని ఈ ఘటన మరోసారి




స్పష్టం చేసింది. రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కావడంతో గ్రామంలోని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను వార్త రూపంలో వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజాజ్యోతికు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అయితే బియ్యం పంపిణీ ప్రారంభించడంతో సమస్య పూర్తిగా పరిష్కారమైనప్పటికీ, ఇకపై ఇలాంటి జాప్యం పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులు అంటున్నారు. ప్రతి నెలా నిర్ణీత సమయంలో రేషన్ బియ్యం అందేలా సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని కోరుతున్నారు. సకాలంలో అందేలా చూడాలి రేషన్ బియ్యం అనేది పేద కుటుంబాలకు ఎంతో కీలకమైన నిత్యావసర సరుకని, సరఫరాలో ఆలస్యం జరిగితే నేరుగా వారి కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక నెల బియ్యం ఆలస్యం అయితే తదుపరి నెలకు కూడా ఇబ్బందులు కొనసాగుతాయని, ముఖ్యంగా కూలీ పనులు చేసుకునే కుటుంబాలకు ఇది భారంగా మారుతుందని చెబుతున్నారు. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా, నిల్వలు, పంపిణీ ప్రక్రియపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్డుదారులు దుకాణాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

**ప్రజా సమస్యపై మీడియా చొరవ**

ప్రజలకు సంబంధించిన సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని స్థానికులు పేర్కొన్నారు. సరండి గ్రామంలో రేషన్ బియ్యం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న విషయాన్ని ప్రజాజ్యోతి కథనం ద్వారా బయటకు తీసుకురావడంతో స్పందన రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. "సమస్యను చెప్పుకుంటే వినేవారు ఉండాలి.. వార్తగా వస్తే పరిష్కారం చూపించేవారు ఉండాలి" అన్నట్లుగా తమ సమస్యకు స్పందన రావడం సంతోషంగా ఉందని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రేషన్ బియ్యం సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజా సమస్య వెలుగులోకి.. అధికారుల స్పందనతో పరిష్కారం దిశగా అడుగు పడటంతో సరండి గ్రామంలో రేషన్ కార్డుదారులకు ఊరట లభించింది.

# తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని

బెజ్జూర్ ఆగస్టు 24(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప మాట్లాడుతూ తెలంగాణలో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ధరణిలో లోపాలు ఉన్నాయంటూ భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం మండలంలోని అనేకమంది రైతులకు 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. దీంతో



రైతులు తమ అవసరాల నిమిత్తం క్రయవిక్రయాలు చేసిన లేదా బ్యాంక్ లో లోన్ పెట్టుకున్న రావడం లేదని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న తమ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని కోనప్ప అన్నారు. పలువురు రైతులు తనను కలిసి తమ భూములు నిషేధిత జాబితాలో చేరాయని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం లేదని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. పూర్తి పట్టాలు కలిగి, ఎన్నో సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటున్న రైతులు వ్యవసాయం చేసుకుంటున్నప్పటికీ 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఈ సందర్భంగా కోనేరు కోనప్ప వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లుగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, యూరియా వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు.రైతుల వద్ద ఉన్న పట్టాలు, హక్కులు, సాగు ఆధారాలను పరిశీలించి అర్హులైన రైతుల భూములను వెంటనే 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ మండల సర్పంచులు ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కోనేరు అభిమానులు తదితరులున్నారు.

## విద్యార్థులకు ఉచితంగా 5వేల విలువగల తెలుగు చూచిరాత

### పెన్సిళ్లు మెడికల్ కిట్ల పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు అంజయ్య

**ఖానాపూర్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాపరమైన ఆరోగ్యపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ వెన్నం అంజయ్య తన స్వంత ఖర్చుతో సమకూర్చిన, విద్యార్థులకు అవసరమైన తెలుగు చూచిరాత, పెన్సిల్లు, మెడికల్ కిట్లను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యా యులు జాడి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు 5 వేల విలువైన సామాగ్రిని ఉచితంగా సమకూర్చడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి రోజు చూచిరాత రాయడం చాలా అవసరమని అన్నారు. చూచిరాత సాధన చేస్తే మంచి దస్తూరి పెరుగుతుందని, ఇది వారి విద్యాప్రమా ణాలను పెంచుతుందని తెలిపారు. తరగతిలో విద్యార్థులకు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తెలుగు ఉపా ధ్యాయులు అంజయ్య చూపిన ఈ సామాజిక బాధ్యతను, చొరవను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.




# ఎస్ఐఆర్ ఫేజ్ -2 లో మరింత అప్రమత్తంగా ఉండాలి

అర్హుల ఓటు ఒక్కటి కూడా పోకుండా చూడాలి
నోటీసులొస్తే తగిన ధృవీకరణ పత్రం అందించి
ఓటు రక్షించుకోవాలి బీఎల్ఏ-2లు కోఆర్డినేషన్
కమిటీ పార్టీ శ్రేణులు అందుకు సమాయత్తం కావాలి
బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుందాం
వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం
ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడిద్దాం
స్థానిక ఎమ్మెల్యే భూకబ్జాలకు అడ్డుకట్ట వేద్దాం
సమీక్షా సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి పిలుపు







**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** ఎస్ఐఆర్ ఫేజ్ -2 లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి శ్రేణులకు సూచిం చారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాల యంలో ఎస్ఐఆర్ తదుపరి ప్రక్రియ పై జరిగిన సమీక్షా స మావేశానికి ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివా స రెడ్డి తో కలిసి హాజరై శ్రే ణులకు దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ తో నియోజక వ ర్గంలోని పలు గ్రామాల్లో 39 వేల ఓట్లు పర్మినెంట్ షిఫ్టిం గ్, డెత్, గైర్హాజరు వలన నమోదు కాలేదన్నారు. పర్మినెంట్ షిఫ్టింగ్ 18 వేలు, మృతి చెందిన వారు 5వేల 83 8, గైర్హాజరు 10వేల 966, ఎన్ రోల్ మెంట్ పూర్తయి నవి 4వేలు, మొత్తం 2లక్షల 50వేల 393 ఓట్లలో 39వే ల 664 ఓట్లు తొలగించే ప్ర మాదం ఉందన్నా రు. ఎస్ ఐఆర్ ఫేజ్ -2 లో బీఎల్ ఏ- 2లు ఎస్ఐఆర్ కోఆర్డినే షన్ కమిటీ ఒక్క అర్హుడి ఓటు కూడా పోవద్దు అని సూచించారు. మ్యాపింగ్ కానివారి కి నోటీసులొస్తే ఎన్నికల కమీషన్ సూచించన 12 ధృవీ కరణ పత్రాలలో ఏదో ఒకటి సమర్పించి ఓటు పోకుండా కాపాడేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓట్లను రక్షించుకోవాలని సూచించారు. పేదల ఓట్లను కాపాడు కోవాల్సిన బాధ్యత మనమీదే ఉందన్నారు. ఫేజ్ వన్‌లో ఎలా చురుకుగా పని చేసామో ఫేజ్ టూలో కూడా అంతే చురుకుగా పని చే యాలని సూచించారు. నోటీ సులొచ్చినవారి వివరాలు సేకరించి వారి ఓటు పోకుండా జాగ్రత్త పడాలని అన్నారు. అవసరమైతే కోర్టు ద్వారా పోరాడి అయినా సరే ఓటును కాపాడుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవే యాలని రాష్ట్ర హైకమాండ్ మనమీద ఒక బాధ్యత పెట్టిందని అన్నారు. దాన్ని మనమంతా సవాల్‌గా తీసుకుని గెలిచేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్ల మెంట్ సీటుతో పాటు పార్ల మెంట్ పరిధిలోని ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలలో గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ అసెంబ్లీ సీటు గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా సమర్పిద్దామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్ని మాయా మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని మాత్రం అడ్డుకోలేరన్నారు. ఎమ్మెల్య పాయల్ శంకర్ కోవర్టు మనల్ని ఏమీ చేయలేరన్నారు. పార్టీ కోసం ఆదిలాబాద్ ప్రజల కోసం తాను పోరాడుతూనే ఉంటా నన్నారు.మీ శక్తితోనే తాను ముందుకు నడుప్తున్నట్టు తెలిపారు. కొత్త పాత కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా తాను కాపాడుకుంటానని అన్నారు. విజయం కోసం అంతా కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. రాష్ట్రంలో మరోమారు పార్టీ అధికారంలోకి రావాలని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. అలాగే దేశంలో పార్టీ అధికారం చేపట్టి ప్రధానిగా రాహుల్ గాంధీ అవుతారని ఆశాభావం వ్యక్తం చేసారు.ఇండ్లు లేని పేద కార్యకర్తలకు ఇండ్లువచ్చేలా కృషి చేస్తానన్నారు.కార్యకర్తలే పార్టీకి బలమన్నారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలకు చరమగీతం పాడుదామన్నారు. ప్రభుత్వ అసైండ్ భూమిని పాయల్ శంకర్ తన భార్యకు బహుమతిగా ఇచ్చారన్నారు. పాయల్ అక్రమాలపై ప్రశ్నించాలన్నారు. భూసేకర ణలో కూడా అక్రమాలకు పాల్పిడితే కాంగ్రెస్ నాయకులు కార్యకర్త లు ఎక్కడికక్కడ అడ్డుకుంటారన్నారు. బీజేపీ కార్యకర్తలే పాయల్ శంకర్ అవినీతి చిట్టాను తమ కందిస్తున్నారని అన్నారు. ఎన్ని కష్టనష్టాలకోర్చయినా తాను ప్రజల తరపున కార్యకర్తల తరపున ఉంటానన్నారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్ళకు తాను భయపడనని అక్రమాలపై నిరంతరం పోరాడుతూనే ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను శ్రేణులు ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ లో పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు.సోషల్ మీడియాలో కూడా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతం చేసుకుని ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని ఒక అజేయ శక్తిగా నిలుపుదామన్నారు.గెలుపుకోసం తన శక్తినంతా ధారపోస్తానన్నారు. అంతా కలిసికట్టుగా పార్టీ కోసం కష్టపడదామని పిలుపునిచ్చారు. నాయకులు కార్యకర్తలను కలవడం చాలా సంతోషంగా ఉందని కంది మౌనా శ్రీనివాస రెడ్డి అన్నారు.. మీ అందరి సహకారం ఇలాగే ఉండాలని కోరుతున్నానని మనవి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు బండారి సతీష్ ఇజ్జగిరి సంజయ్, ఖిజర్ పాషా, సుధాకర్ రెడ్డిలోక ప్రవీణ్ రెడ్డి, కొండ గంగాధర్ మునిగెల నర్సింగ్ మునిగెల విటల్, గుడిపల్లి నగేష్,శాంతన్ రావు,భోజారెడ్డి దాసరి ఆశన్న, షాహిద్ ఆలీ, మహబూబ్ ,చరణ్ గౌడ్, రాందాస్ నాక్లే బిక్కి గంగాధర్, అశోక్ ఠాక్రె, సుదర్శన్ అల్చెట్టి నాగన్న, కోలా నర్సింలు, సుఖేందర్ అన్నపూర్ణ ,స్వాతి కాంబ్లే, మంచికట్ల ఆశమ్మ, శ్రీలేఖ, కావేటి జ్యోతి,సోనియా జుబేదా, రఫీఖ్, ఎంఏ షకీల్ వెంకట్ యాదవ్, బత్తుల శ్రీనివాస్, బాపూరావు,ఆత్రం నగేష్ కమలాబాయి, నితిన్ బోయర్, వేణుగోపాల రెడ్డి,వామన్, నిమ్మల గౌతం రెడ్డి ,ఆతిఖ్ శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యవసాయ అధికారి కమిషనరేట్కు సరెండర్ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ భవేష్ మిశ్రా

కొత్త జిల్లా అధికారిగా ఖానాపూర్

ఏ డి ఏ సుజాతకు అదనపు బాధ్యతలు

**ఖానాపూర్ ఆగస్టు 24( ప్రజా జ్యోతి)** గత రెండు శతాబ్దాలుగా జిల్లాలోనే పనిచేస్తూ రైతుల నుండి పలు ఆరోపణలతో పాటు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంవహించినందుకు నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జిల్లా వ్యవసాయ అధికారి అంజిరెడ్డిని కమిషనరేట్కు సరెండర్ చేస్తూ జిల్లా ఉత్తర్వులు జారీ చేశారు ఈ మేరకు ఖానాపూర్ లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేస్తున్న సుజాతకు నిర్మల్ జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది సరెండర్ అయినా జిల్లా అధికారి విధుల్లో విజిలెన్స్ అధికారుల దర్యాప్తు మేరకే కలెక్టర్ ఈ చర్యలకు పూలుకున్నట్లు పలువురు భావిస్తున్నారు

## సీజన్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు



**ఇచ్చోడ ఆగస్టు 24,(ప్రజా జ్యోతి):** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని టీజీ టీడబ్ల్యు ఆర్ఎస్ బాయ్స్ హాస్టల్, కేజీబీవీ గర్ల్స్ హాస్టల్లో సోమవారం మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ మధురమ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు .వంట గదులను పరిశీలించి శు భ్రమైన భోజనం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధురిమ ,ఎం ఓ బ్రహ్మానంద రెడ్డి సిహెచ్ఓ రాజుబాయి, పి హెచ్ ఎన్ రాథోడ్ కైలాష్ సుభాష్,హెల్త్ అసిస్టెంట్, సుధారాణి పద్మ, ఎన్ఎంఎస్ సుమతి,ఎల్ టి ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఖానాపూర్ లో ప్రజావాహిని

నోడల్ అధికారి ఎంపీడీవో రాథోడ్ రాధా




**ఖానాపూర్ ఆగస్టు 24( ప్రజా జ్యోతి)** జిల్లా డివిజన్లకే పరిమితమైన ప్రజావాని కార్యక్రమాలు గత రెండు వారాల నుండి ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించాలన్న ఆదేశాల మేరకు ఖానాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నోడల్ అధికారి ఎంపీడీవో రాథోడ్ రాధా ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ సుజాత రెడ్డి తో పాటు పలువురు వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు పాల్గొన్నారు ఈ మేరకు పలు సమస్యల పట్ల ప్రజావాణిలో ప్రజలు వినతి పత్రాలు సమర్పించగా పరిష్కారానికి ఏ శాఖలకు చెందిందో దాన్ని గుర్తించి త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు ఈ మేరకు మండల స్థాయిలోని ప్రజలు పాల్గొని సమస్యలు విన్నవించారు

## రాజంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఆసిఫాబాద్ ఆగస్టు 24 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండల కేంద్రం లోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్రా పోచయ్య పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికీ చేరేలా చూస్తామన్నారు. సాంకేతికతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందుతాయని వివరించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మామిడి లక్ష్మీ, వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావిద్, వార్డు సభ్యులు బొట్టుపల్లి లావణ్య, త్రిశూల నానయ్య, కొమరం వేణు, బుర్రా భూపతి, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, బిల్ కలెక్టర్ నాగేంద్ర, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## నిర్మల్ జిల్లా కోర్టులో హైకోర్టు జడ్జి తనిఖీలు





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 24 ,( ప్రజాజ్యోతి ).** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టుని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సుజనా శని వారం తనిఖీ చేశారు జిల్లా ఫోక్సో కోర్టును కూడా సందర్శించా రు కోర్టులో రికార్డుల ను పరిశీలించి వివ రాలు అడిగి తెలుసు కున్నారు అనంతరం నిర్మల్ మండలం రానాపూర్ శివారు లో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవన సముదాయ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు దానికంటే ముందు అటవీ శాఖ అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ కే సుజన కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీవాణి బైంసా ఏ ఎస్ పి సాయి కిరణ్ నిర్మల్ డి.ఎస్.పి శ్రీనివాస్ పుష్పగుచ్చాలు అందించి న్యాయమూ ర్తికి ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రాధిక రవీందర్ నికిత భవిష్య చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చంద్రమోహన్ సీనియర్ సూపరిండెంట్ రాజారామ్ తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణ వాగుపై వంతెన కోసం ప్రజావాణిలో వినతి

### యాకర్ పల్లి సర్పంచ్, గ్రామస్తులు



**సారంగాపూర్,ఆగస్టు 24,ప్రజా జ్యోతి** సారంగాపూర్ మండలం యాకర్ పల్లి గ్రామం నుండి వంజర్ గ్రామాన్ని కలుపుతూ స్వర్ణ వాగుపై లో–లెవల్ వంతెన నిర్మించాలని కోరుతూ యాకర్ పల్లి గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యాకర్ పల్లి నుండి వంజర్ గ్రామానికి కేవలం 2 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉన్నప్పటికీ, స్వర్ణ వాగుపై వంతెన లేకపోవడంతో రైతులు, విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు. వాగు అవతల సుమారు 400 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని, ముఖ్యంగా వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో దాటడం ఎంతో ప్రమాదకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, మండల కేంద్రంలోని శ్రీ మహా పోచమ్మ దేవాలయ గంగనీళ్ల జాతర సందర్భంగా అమ్మవారి నగలను శుద్ధి చేయడానికి వాగు దాటి స్వాంగి గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని, ఈ సమయంలో కూడా గ్రామస్తులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం జరిగితే యాకర్ పల్లి వంజర్, తాండ్ర, వైకుంఠాపూర్, కాంకెట గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే సారంగాపూర్ నుండి భైంసా, ఆదిలాబాద్ వైపు ప్రయాణించే వారికి దూరభారం తగ్గడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి స్వర్ణ వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకొని మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ నవీన్, పాల్దా గజేందర్, చిట్యాల పెద్ద బాపు, చిదగు రాజు రెడ్డి, పత్తి సాగర్, ప్రసాద్ రెడ్డి, నర్సారెడ్డి, వెంకటేష్ గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఇళ్లకు అటవీ గ్రహణం!

**అడ్డొస్తున్న ఫారెస్ట్ అధికారులు**
**డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్కను కలిసిన బాధితులు**



**ఆసిఫాబాద్ ఆగస్టు 24 ప్రజా జ్యోతి** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుందామంటే అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, అధికారుల వైఖరితో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆదివాసీలు వాపోయారు. ఈ మేరకు సోమవారం డీసీసీ కార్యాలయంలో అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. లింగాపూర్ మండలం జాముల్ ధార పంచాయతీ పరిధిలోని కెన్నెపల్లి, రెంగగూడ, పూనగూడ, సోలార్‌గూడ, సిడాంగూడ గ్రామాలకు చెందిన బాధితులు సర్పంచ్ జుగ్నాక గంగాదేవి ఆధ్వర్యంలో సుగుణక్కను ఆశ్రయించారు. తమ గ్రామాలు ఫారెస్ట్ పరిధిలోకి వస్తున్నాయనే నెపంతో అధికారులు ఇళ్ల నిర్మాణ పనులను నిలిపివేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చొరవ తీసుకుని తమ సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

**మంత్రి దృష్టికి తీసుకెళ్తాం: ఆత్రం సుగుణక్క**

బాధితుల సమస్యపై స్పందించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆదివాసీలు ఇళ్లు నిర్మించుకునేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశ్వంత్ రావు, ఆడ యదోరావు, ఆత్రం మోతిరాం, ఆడ జంగు, సిడం రాజేశ్వర్, సలాం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల గురించి కలెక్టర్ ను కలిసిన జేఏసీ నాయకులు



**అదిలాబాద్ టౌన్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి )** ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలు, పెండింగ్ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆదిలాబాద్ జిల్లా ఉద్యోగులు ( జేఏసీ )డిమాండ్ చేసారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న ఆది లాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉద్యోగుల సమస్యలపై ఆదిలా బాద్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను సోమవారం కలెక్టరేట్ చాంబర్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ డిమాండ్ల ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర జేఏసీ నాయకత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులు మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరతగతిన పరిష్కరించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

2వ పిఆర్సిని వెంటనే అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న 6 విడతల డి ఏ డిఆర్ ను వెంటనే విడుదల చేయాలి. సీపీస్ ను రద్దు చేసి ఒపీయస్ ను పునరుద్ధరించాలి. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి. నూతన ఈ హెచ్ ఎస్ ను సమర్థవంతం గా అమలు చేయాలి. కలెక్టర్ ను కలిసిన వారిలో తెలం గాణ గెజిటె డ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, టీఎన్జీవో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్స్ సంఘం అధ్యక్షులు సప్ దర్ అలీ, టిజిఓ జిల్లా కార్యదర్శి రామారావు, రాథోడ్, జిల్లా అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్, టీటీఫ్ జిల్లా అధ్యక్షులు శోగల సుదర్శన్, టిఆర్పిఎఫ్ అధ్యక్షులు చిలక సతీష్, బి ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు తెలంగాణ ఆల్ ఇంజనీర్స్ యూనియన్, టీఎన్జీవో యూనియన్ సభ్యులు తిరుమల్ రెడ్డి, రాజేశ్వర్, శరత్ , శ్రీనివాస్ మెడికల్ ఫోరం, సిడం వామన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణి ని పరామర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే దంపతులు బొజ్జు పటేల్ దృపద



**ఖానాపూర్ ఆగస్ట్ 24 (ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణి మోకాలికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న, ఖానాపూర్ ఎమ్మెల్యే దంపతులు బొజ్జు పటేల్ దృపదలు సోమవారం హైదరాబాద్ లో సక్కు సతీమణి ని ఆసుపత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పదేళ్లుగా మహిళా సీఎస్పీ ఏజెంట్ ప్రస్థానం.



**బాసర ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** బాసర ఎస్బీఐ బ్యాంకు వద్ద కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్పీ) ఏజెంట్గా పందు సంధ్యారాణి గత పదేళ్లుగా సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. మహిళగా ఎలాంటి సంకోచం లేకుండా బాధ్యతలు చేపట్టి, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. బ్యాంకు ఖాతా తెరవడం, నగదు లావాదేవీలు, ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో పాటు వివిధ పాలసీలు, ఇతర బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, వారి అవసరాలను ఓపికగా తెలుసుకుని పనులు పూర్తి చేయడమే తన సేవా విధానంగా ఆమె చెబుతున్నారు.

**మహిళలకు ఆదర్శంగా..**

మహిళలు ఉద్యోగం లేదా ఉపాధి కోసం ఇతరులపై ఆధారపడకుండా తమకు నచ్చిన రంగంలో ధైర్యంగా ముందుకు రావాలని సంధ్యారాణి సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులు, సమాజం మహిళలకు సహకారం అందిస్తే వారు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగగలరని పేర్కొన్నారు. పదేళ్లుగా సీఎస్పీ కేంద్రం ద్వారా ప్రజలకు సేవలందించడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని సమయంలో ప్రజలకు సీఎస్పీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, 10 గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సమీపంలోనే పలు బ్యాంకింగ్ సేవలు అందించడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ తరగతులు ప్రారంభం



**బాసర ఆగస్టు 24 (ప్రజా జ్యోతి) బాసర:**మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం కంప్యూటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. 3, 4, 5వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు గంటపాటు కంప్యూటర్ క్లాసులు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మమ్మాయి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య 73 నుంచి 150కి పైగా పెరిగిన సమయంలో కంప్యూటర్ తరగతులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రూ. 2.89 కోట్లతో బీటీ, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.



**లక్సెట్టిపేట, ఆగష్టు 24(ప్రజాజ్యోతి)** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని కొత్త కొమ్ముగూడెం సర్పంచ్ సందెల సుజాత అన్నారు. సోమవారం మండలంలోని కొత్త కొమ్ముగూడెం నుంచి దౌడపల్లి వరకు సుమారు రూ 2.89 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో కొత్త కొమ్ముగూడెం, దౌడపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అదే విధంగా మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖమ్మ సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. అనంతరం సురేఖమ్మను శాలువాతో సర్పంచ్ దంపతులు సందేల సుజాత -సురేష్ లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,సర్పంచ్ నలిమెల రాజు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ కందుల మోహన్, జిల్లా నాయకులు పూర్ణచంద్ర రావు, బియ్యాల తిరుపతి, మండల మాజీ అధ్యక్షులు పింగిలి రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బొప్పు సుమన్ , కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వడూర్ లో వైద్య శిబిరం



**నేరడిగొండ, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):**మండలంలోని వడూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ అధ్యక్షతన ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించారు. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ భూషన్, పంచాయతీ కార్యదర్శి సద్దాం, ఆరోగ్య సిబ్బంది జగదీష్, మౌనిక, సుజాత, పుష్పలత, వీరయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**రూ.15,280 నగదు, 6 సెల్ఫోన్లు స్వాధీనం**

**సారంగాపూర్, ఆగస్టు 24,ప్రజా జ్యోతి** మండలంలోని స్వర్ణ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.15,280 నగదుతో పాటు 6 సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలో పేకాటతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. పేకాట నిర్వహించినా, ఆడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పందుల దాడిలో పంట నష్టం





**బోథ్, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** మండలంలోని రఘునాథపూర్ గ్రామంలో చందర్ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట ను అడవి పందులు ధ్వంసం చేసినట్లుగా తెలిపారు. దీంతో తీవ్రంగా నష్టపోయినట్లుగా బాధితుడు తెలిపాడు. ఈ సందర్భంగా బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం కౌలుకు తీసుకొని రెండు ఎకరాలలో మొక్కజొన్న పంటను వేసినట్లుగా తెలిపారు. ఈ క్రమంలో అడవి పందులు పంటను ధ్వంసం చేయడంతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిలినట్లుగా పేర్కొన్నారు. అనంతరం గ్రామ ఉపసర్పంచ్ గణేష్ అన్నదాత ఆవేదనను అర్థం చేసుకొని అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# వార్డు సభ్యురాలి ఇంటికి సీసీ రోడ్డు..! నిబంధనలు పక్కన పెట్టి పనులు

## చేపట్టారంటూ స్థానికుల ఆరోపణలు..

## కార్యదర్శి సహకారంపై ప్రశ్నలు



**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 4వ వార్డు సభ్యురాలి ఇంటి వద్దకు సీసీ రోడ్డు పనులు చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రాధాన్యత కలిగిన ప్రజా అవసరాలను పక్కనపెట్టి, వ్యక్తిగత ప్రయోజనానికి అనుకూలంగా రోడ్డు పనులు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనులకు పంచాయతీ కార్యదర్శి సహకారం అందించారనే విమర్శలు కూడా స్థానికుల నుంచి వస్తున్నాయి. గ్రామపంచాయతీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఏ ప్రాతిపదికన స్థలం ఎంపిక చేశారు? గ్రామసభలో నిర్ణయం తీసుకున్నారా? పనులకు సంబంధించి తీర్మానం, అంచనాలు, అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా అవసరాల కోసం కేటాయించిన నిధులు వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించకూడదని, అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారం పై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గమనిక: ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కాలేదని, సంబంధిత 4వ వార్డు సభ్యురాలు మరియు పంచాయతీ కార్యదర్శి వివరణ తీసుకున్న తర్వాత వార్తలో వారి వాదనను కూడా చేర్చడం సముచితం.

# వడ్యాల్ లో బైపాస్ రోడ్డు అభివృద్ధికి కొలతలు



**లక్ష్మణ చాంద, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి)** ఇటీవల వడ్యాల్ గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కోసం తో పాటు ప్రయాణికులకు, గ్రామస్తులకు ,వాహనదారులకు రోడ్డు ఇబ్బంది ఇబ్బందిగా మారడం తో డబుల్ రోడ్డు కావాలని వారు ఇటీవల హైదరాబాద్ వెల్లి రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలువగా వారి ఆదేశాల మేరకు సోమవారం రోజున ఆర్ అండ్ బి ఏ ఈ అంజనేశ్వర్ సోమవారం రోజున వారి బృందంతో వచ్చి వడ్యాల్ గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి, కెనాల్ నూతన వంతెన నిర్మాణానికి కొలతలు చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని కాంగ్రెస్ మండల నాయకులు కొండ్ర నరేష్ రెడ్డి తెలిపారు. వారి వెంట వడ్యాల్ గ్రామ సర్పంచ్ పసుపుల నరేష్, మాజీ జెడ్పిటిసి నారా గౌడ్, ఉప సర్పంచ్ రవీందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఠాకూర్ కిరణ్ గ్రామస్తులు ఉన్నారు.

## అక్రమంగా పోలీస్ సైరన్ అమర్చిన వ్యక్తి అరెస్ట్




**నేరడిగొండ, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ప్రైవేట్ కారుకు అక్రమంగా పోలీస్ సైరన్ అమర్చుకుని ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిని నేరడిగొండ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి కారును పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు ఇచ్చోడ రూరల్ సీఐ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ పోలీసు సిబ్బందితో కలిసి కుంతల ఎక్స్‌రోడ్డు పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఓ ప్రైవేట్ వాహనంలో పోలీస్ సైరన్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు.విచారణలో నిందితుడిని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సంపల్లి తండాకు చెందిన గుగులోత్ రాజేష్ (26)గా గుర్తించారు. అతడు ప్రయాణిస్తున్న తెలుపు రంగు మారుతి ఎర్టిగా కారు ( టీఎస్ 6 ఎఫ్ జె 5353)కు అక్రమంగా పోలీస్ సైరన్ అమర్చినట్లు పోలీసులు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో సైరన్ మోగిస్తూ, తన వాహనం పోలీస్ వాహనమని ప్రజలను నమ్మించి, భయపెట్టి దారి తీసుకునేవాడినని విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.సాక్షుల సమక్షంలో వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు అందులోని సైరన్ హారన్‌ను గుర్తించి, కారును అక్కడికక్కడే స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 251/ 2026, బి ఎన్ ఎస్ సెక్షన్ 318(4) కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ప్రైవేట్ వాహనాలకు పోలీస్ సైరన్లు, ఎర్ర బుగ్గలు, అనధికారిక బోర్డులు తదితరాలను అమర్చడం చట్టరీత్యా నేరమని ఇచ్చోడ రూరల్ సీఐ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఇచ్చోడ మండలంలోని మాధాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీ షేక్ ఇమ్రాన్ షాదుల్లా గారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో మొక్కలు నేటి కార్యక్రమం నిర్వహించారు.



**చ్చోడ ఆగష్టు 24( ప్రజాజోతి)**పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటి, విద్యార్థులకు స్వచ్ఛమైన గాలి మరియు ఆహ్లాద కరమైన వాతావరణాన్ని అందించే దిశగా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మేకల శ్రీనివాస్.ఎం.డి. రహీమ్,షిండే వినాయక్ మరియు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు ఒక మొక్క నాటడం అంటే భావి తరాలకు భవిషత్తు బాటచుపినట్టు అని అయన పేర్కొన్నరు

## సన్మానం



**బోథ్, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** ఇటీవల నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను సోమవారం బోథ్ మండల బిఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు దాసరి పురుషోత్తం,ప్రధాన కార్యదర్శి కుమ్మరి వంశీ, సలహాదారు సాయిని గంగాధర్ లను శాలువాల తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు స్వామి,మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,అడ్వకేట్ పాంద్రం శంకర్, బోథ్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, సురేందర్ యాదవ్,సర్పంచ్ లు రూప్చంద్,విశ్వేష్, సంజీవ్,రవి, రాజు, రవీందర్,మాజీ సర్పంచ్ లు కుమ్మరి రమణ, గంగమల్లు, ఇఫ్తేకర్, అమృత్, నారాయణ ఉప సర్పంచ్ రాజేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## లక్ష్మణ చాందలో డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి కొలతలు



**లక్ష్మణ చాంద, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**మండల కేంద్రంలో డబుల్ రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న దృశ్య ఇటీవల మండల నాయకులు హైదరాబాదు వెల్లిరోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలవడంతో వారి ఆదేశాల మేరకు లక్ష్మణ చాంద మండల కేంద్రంలో గ్రామం నడి మధ్య నుండి డబుల్ లైన్ రోడ్డు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కొరకు ఆర్ అండ్ బి ఏఈ అంజనేశ్వర్ సోమవారం రోజున రోడ్డు కొలతలను చేసి ప్రభుత్వానికి పంపించారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్ అన్నారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షులు అస్గర్, బొజ్జ రవి, మల్లేష్,నాగేష్, కల్లెడ భూమన్న, వెంకట్,వినేష్, వడ్యాల్ ఉప సర్పంచ్ రవీందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కిరణ్

# మాయమవుతున్న పురాతన రహదారులు

## వ్యవసాయ పొలానికి వెల్ల డానికి దారులు లేక రైతుల ఇబ్బందులు

## కంచెలు వేసి కబ్జా చేసుకున్నా పట్టించుకోని అధికారులు

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** గ్రామీణ ప్రాంతాలలో పురా తన వ్యవసాయ పొలాలకు వెల్లే రహదారులు కనిపించ డం లేదు. పానాధీ ( రహ దారి) లు అక్రమార్కుల క బ్జాలోకి వెళ్లిపోయాయి. అ ధికారుల నిర్లక్ష్యం, అసమ ర్థతల వల్ల కబ్జాకోరులు హ ద్దులు దాటుతున్నారు. పు రాతన రహదారిని కబ్జా చే సుకున్నారని పిర్యాదులు చే స్తున్నా అధికారులు పట్టిం చు కోవడం లేదనే ఆరో ప నలు ఎదుర్కొంటున్నారు. తన రహదారులను బయట తీయడానికి అధికారులు కూడా నా నా తంటాలు ప డుతున్నారు. మండలానికి కొత్తగా వచ్చే అధికారులు వారికి పురాతన రహదారు లపై అంతగా అవగాహన లే కపోవడం వల్ల వాటిని నిర్ధా రించడంలో ఇష్టారీతిన వ్య వహరిస్తున్నట్టు తెలుస్తోంది. పిర్యాదులు, ఒత్తిళ్లు వచ్చిన వెంటనే అధికారులు పక్క వారిని ఏమాత్రం విచారించ కుండా కొత్త రహదారులను నిర్ధా రించడం వల్ల అవివి వాద స్పదంగా మారుతు న్నాయి. ఏజెన్సీ మండల కేంద్రాలలో ఈ రహదారుల వివాదం మరింత ముదురుతోంది. ఆదిలాబాదు జిల్లా ఏజెన్సీ ఇచ్చోడ మండల కేంద్రంలో అధికంగా ఈ పురాతన రహదారులు మాయం అవుతున్నా యి. ఏజె న్సీ మండల కేంద్రమైన ఇ చ్చోడలో వందలాది ఎక రాల వ్యవసాయ భూమి 37 సర్వే నంబర్ యజమాని నిజామొద్దీన్ తండ్రి ధస్త గిరి లేకపోవడం వల్ల ఈ భూమి ని అనేకమంది కబ్జా చేసుకుని పట్టాలు చేసుకు న్నారు. ఇందులో కొంత భూమి ప్రభుత్వం ఆధీనంలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అనేకమంది భూములను కబ్జాలు చేసుకొని పట్టాలు చేసుకున్నారని ఆ భూమి ని తమకు అప్పగించాలని నిజాముద్దీన్ వారసులుగా చెప్పుకుని ఓ రైతు కోర్టుకెక్కి అనుమతి కూడా తెచ్చు కున్నారు. నిజాముద్దీన్ కు సం బంధించిన భూములను వా రసులకు అప్పగించాలని ఓ రైతు కోర్టు ఆదేశాలను తె చ్చుకొని అధికారులకు ఇ చ్చినప్పటికీ ఆభూములు అన్ని ఆక్రమణదారుల ఆధీ నంలో ఉండడం అందులో ఆక్రమణ దారులందరికి ప ట్టాలు జారి కావడంతో అధి కారులు ఆ భూములను అప్పగించడానికి వెనుకంజ వే స్తున్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆ భూములను అప్పగించ డంలో అధికారు లు వెనుకంజ వేయడం పలు అనుమానాలకు ధారి తీ స్తుంది. ఇదిలా ఉండగా పొలాలకు వెళ్లే దారులన్నీ మూసుకుపోయాయి. జా తీయ రహదారి 44 కు ఆ నుకొని ఉన్న 37 /9 సర్వే నంబర్ భూమి లో నుండి 37 సర్వే నంబర్ లోని మరి కొన్ని విభాగాలకు వెల్లడా నికి రహదారి ఉండగా ఆరహదారి పూర్తిగా కబ్జాకు గురైంది. పురాతన రహదారి నుంచి మండలంలోని దు బార్ పేట్ గ్రామానికి కూడా ప్రజలు రైతులు వెళ్లేవారు. 37/9 సర్వే నంబర్ నుంచి ఇతర వ్యవసాయ భూము లకు 37 సర్వే నంబర్ లోని ఇతర విభాగాల వ్యవసా య భూములకు వెళ్లే రహ దారిని ఆదిలోనే జాతీయ రహదారి వద్దనే బచ్చువార్ లక్ష్మణ్ అని రైతు తన వ్య వసాయ భూమికి ఆనుకొని ఉన్న పురాతన రహదారిని కబ్జా చేసుకొని కంచె వేశార ని, దీనిని తొలగించి ఆ ర హదారిని పునరుద్దరించా లని, ఆ చుట్టూ పక్కన గల కొందరు రైతులు అధికారు లకు ఫిర్యాదు చేసినా పట్టిం చుకోవ డంలేదని, ఆ రైతు పక్షానే మాట్లాడుతున్నార ని పలువురు రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. త మ పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టు న్నామని, తక్షణమే జా తీయ రహదారి నుంచి 37/9 సర్వేనెంబర్ గల భూ మికి ఆ నుకొని ఉన్న పురా తన రహ దారిని పునరు ద్ధరించాలని జిల్లా అధికారులను చుట్టూ ఉన్న రైతులు కోరారు.



# లక్ష్యం పై పట్టు సాధిస్తే కొలువు ఖాయం

## అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షి షా దిశానిర్దేశం

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** నిర్దిష్టమైన ప్రణాళిక, పట్టు దలతో చదివితే పోటీ పరీక్ష ల్లో విజయం సాధించి ఉన్న త కొలువులు సాధించడం సులువవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కి ల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న 5 నెలల ఉచిత రెసిడెన్షి యల్ శిక్షణలో భాగంగా ఆ దివారం స్థానిక రాంనగర్ కాలనీలోని ఎస్సీ స్టడీ సర్కి ల్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు స న్నద్ధమవుతున్న అభ్యర్థుల కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఉచితంగా పుస్తకా లు, నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సివిల్స్ ప్రిపరేషన్ అనుభ వాలను విద్యార్థులతో పం చుకుంటూ పోటీ పరీక్షల త యారీపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష ఏదైనా ముందుగా సి ల బస్ పై సంపూర్ణ స్పష్టత ఉండాలని, పరిమిత ప్రామాణిక పుస్తకాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. వార్తాపత్రికలు, మేగజైన్ల నుంచి ముఖ్యమైన అంశాల ను స్వయంగా నోట్స్ రాసు కుంటే చివరి సమయంలో రివిజన్ సులభమవు తుంద ని తెలిపారు. తక్కువమంది మిత్రులతో గ్రూప్ స్టడీ చేయ డం ద్వారా విషయ పరిజ్ఞా నం పెరుగుతుందని, సందే హాలు నివృత్తి అవుతాయని చెప్పారు. మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు రాస్తూ త ప్పులను విశ్లేషించు కోవా లని, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల్లో




సరైన జవాబును గుర్తించేందుకు ఎలిమినేషన్ పద్ధతి ఎంతో ఉపయోగప డుతుందని పేర్కొన్నారు. త్వరలోనే పలు ప్రభుత్వ ఉ ద్యోగ నియామకాలు రాను న్నందున అభ్యర్థులు ఫోన్ వంటి ఆకర్షణలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదవాలని పిలుపుని చ్చారు. స్టడీ సర్కిల్ భవన శాశ్వత ని ర్మాణంతో పాటు డిజిటల్ బోధనకు ఐఎఫ్‌పీ ప్యానె ల్స్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ కా ర్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. కె.రమేష్, అధ్యాపకులు, ఉద్యోగార్థులు, తదిత రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఎంపీడీవో సరోజ



**లక్ష్మణ చాంద ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని లక్ష్మణ చాంద ఎంపీడీవో సరోజ అన్నారు. సోమవారం రోజున మూడు దరఖాస్తులు వచ్చాయని ఒకటి పెన్షన్, రెండు దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు త్వరగా ఆ పరిష్కారం ఏ శాఖకు చెందిందో గుర్తించి త్వరలోనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సరిత, ఎంపీ ఓ నసీరుద్దీన్, ఎన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## విమానాశ్రయ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా






**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి)**జిల్లాలో విమానా శ్రయం ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధి కారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో విమానాశ్ర యం ఏర్పాటులో భాగంగా భూ సేకరణ తదితర అంశాల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా విలీన గ్రామాలు తదితర ప్రాంతాల్లో భూ సేకరణ, సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తి చేయడంపై చర్చించారు. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రక్రి యను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, స్ప ష్టమైన సమాచారంతో పార దర్శకంగా పనులు ముందు కు తీసుకెళ్లాలని సూచించారు.ఈ సమావేశంలో అదన పు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, ల్యాండ్ సర్వేర్ ఏడీ ప్రభాకర్, ఆర్డీఓ జగదీ శ్వర్, ఇరిగేషన్ ఎస్ఈ ప్రభు కళ్యాణ్, అలాగే సంబంధిత శాఖల అధికారులు, తహశీ ల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ – పీజీ 2026 ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** ఈ నెల 30న నిర్వహించ నున్న నీట్–పీజీ –2026 ప్రవే శ పరీక్షను పకడ్బందీగా, ఎ లాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముంద స్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాల యంలో నీట్–పీజీ –2026 ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఉన్నత స్థా యి సమీక్షా సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్–పీజీ –2026 ప్ర వేశ పరీక్షను పకడ్బందీగా, ఎలాంటి లోపాలకు తావులే కుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలనీ అ ధికారులను ఆదేశించారు. స్థానిక మావల నలంద డిగ్రీ, పీజీ కళాశాలలో 100 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సింగిల్ షిఫ్ట్‌లో కం ప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) పద్ధతిలో ఈ పరీక్ష జరగనుందన్నారు. ఉదయం 7 గంటల నుండి 8:30 గం టల వరకు అభ్యర్థులను ప రీక్ష కేంద్రాల్లోకి అనుమతించ నున్నట్లు వెల్లడించారు. జి ల్లాలో పరీక్ష నిర్వహణకు త గిన ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక ప్రత్యేక అధి కారిని నియమించి, కేంద్రాల వారీగా పూర్తి వివరాలను ఎన్‌బీఈఎంఎస్ నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రా ల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులకు క్షుణ్ణంగా హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించడం



తో పాటు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక మహిళా సిబ్బందితో ఫ్రిస్కింగ్ ఏర్పాట్లు చేయాల న్నారు. ఒరిజినల్ ఫోటో ఐడీ కార్డులు, ఆధార్/బ యోమెట్రిక్ ధృవీకరణ చేపట్టి, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కమ్యూనికేషన్ డివైజెస్ పరీక్షా కేంద్రంలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష జరిగే సమ యంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రశ్నాపత్రాల డౌన్‌లోడింగ్, అభ్యర్థుల రెస్పాన్స్ డేటా అప్‌లోడింగ్ కోసం మెరుగైన ఇంటర్నెట్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బందిని మోహరించాలని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, నకిలీ ప్రచారాలు, లీక్ వంతులు రాకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలను కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రు, ఎస్.రాజేశ్వర్, డిహెచ్ఎంహెచ్వో డా.సాధన, డిఐఈఓ గణేష్ జాదవ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పర్యవేక్షకురాలు శైలజ, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్, కళాశాల ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన స్వరం

**మంచిర్యాల, 24, ఆగస్టు (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రయోజ నాలు, అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం చేపట్టిన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి నిర్వహించిన మీడియా సమావేశం లో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్--2047 దార్శనికతలో భాగంగా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పెట్టుబడుల ను ఆకర్షించడం, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం, తెలంగాణను అభివృద్ధి పథంలో




ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా అమెరికా పర్యటనను చేపట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ పర్యటనకు రాజకీయ కారణాలతో కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం తెలంగాణ పట్ల వివక్ష చూపడమేనని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం సరికాదని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొని రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న వైఖరికి మద్దతు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రజావాణి అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 24, (ప్రజా జ్యోతి )** ప్రజావాణిలో వచ్చే అర్జీల ను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ ర్షిషా అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ర్వహించిన ప్రజావాణి కార్య క్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను శ్రద్ధగా ఆల కించి, త్వరితగతిన పరిష్కరిం చాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రజావాణిలో భూభారతి, చేయూ త పింఛను, ఇందిరమ్మ ఇ ళు విద్య, వైద్యం, వివిధ శాఖలకు సంబంధించిన 63 అర్జీలు రావ డం జరిగిందని తెలిపారు. ఒకే సమస్యపై దర ఖాస్తుదారులు పలుమార్లు అర్జీలు సమర్పించకుండా, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జులపై తీసుకున్న చర్యలపై దరఖాస్తుదారులకు సమాధానాన్ని అందజేయాలన్నారు.అనంతరం సెన్సెస్ హ్యాండ్ బుక్ తయారీతో పాటు, వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖా స్తుల పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకుపలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ ప్ర జావాణిలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, రాజేశ్వర్, డి.ఆర్. ఓ. స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సీఐకి ఘన సత్కారం

**శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరిస్తాం: అంబేద్కర్ సెంటర్ కమిటీ)**



**ఆసిఫాబాద్ ఆగష్టు 24 ప్రజా జ్యోతి** బాధ్యతలు స్వీకరించిన ఆసిఫాబాద్ నూతన సీఐని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ కార్యాలయంలో ఆయనకు పులమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సీఐతో మాట్లాడిన కమిటీ ప్రతినిధులు.. పట్టణ పరిధిలోని సామాజిక అంశాలు, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై ఆత్మీయంగా చర్చించారు. పోలీసు శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసు వ్యవస్థకు సెంటర్ కమిటీ ఎల్లవేళలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ కమిటీ అధ్యక్షులు మసాదే ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రశాంత్, ఉపాధ్యక్షులు విలాస్ కోబ్రగడె, లుంబిని దీక్ష భూమి ప్రధాన కార్యదర్శి వైరగడె రాజకుమార్, కోశాధికారి దుర్గం అనిల్, స్టీరింగ్ కమిటీ మెంబర్ చునర్కర్ శ్రీకాంత్, కార్యదర్శి మహాత్మా రాజేంద్రప్రసాద్, నాయకులు చాపిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు లక్కీ డ్రా.

**మందమర్రి, ఆగస్టు 24(ప్రజాజ్యోతి ):** మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు.మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా ఈ నెల 25న ఉదయం 10 గంటలకు సండ్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్‌ను కేటాయించనున్నారు. ఎలాంటి వివక్షకు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అందరికీ సమాన అవకాశం కల్పించేలా ప్రక్రియను నిర్వహిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.లబ్ధిదారులకు మాత్రమే హాల్‌లోకి ప్రవేశం ఉంటుందని, వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.ఇళ్ల కేటాయింపు అనంతరం ఎవరైనా




అనర్హులు లబ్ధిదారులుగా ఎంపికైనట్లు వ్రాతపూర్వక ఫిర్యాదులు అందితే సమగ్రంగా విచారణ చేపడతామని తెలిపారు. అనర్హులకు ఇళ్లు కేటాయించినట్లు నిర్ధారణ అయితే కేటాయింపులను రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా ప్రజలు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# మీలాద్-ఉన్-నబీని ప్రశాంతంగా నిర్వహించాలి



## పీస్ కమిటీ సమావేశంలో రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, 24, ఆగస్టు (ప్రజా జ్యోతి):** మీలాద్-ఉన్-నబీ (ఈద్-ఎ-మిలాద్) పండుగను శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జులూసులు, ర్యాలీలు నిర్వహించే వారు ముందస్తు పోలీసు అనుమతులు తీసుకోవడంతో పాటు నిర్ణయించిన మార్గాల్లోనే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు, ఇతర పరికరాలను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించరాదని స్పష్టం చేశారు. చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ప్రసంగాలు, పాటలు, నినాదాలకు దూరంగా ఉండాలని, ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని సూచించారు.యువత శాంతి, క్రమశిక్షణతో వ్యవహరించి గొడవలు, వివాదాలకు దూరంగా ఉండాలని సీపీ తెలిపారు. పండుగ కార్యక్రమాల్లో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ర్యాలీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు.సోషల్ మీడియా



ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లు వ్యాప్తి చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు చేయవద్దని, అనుమానాస్పద సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా ముందుగా పోలీసులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. మత ఘర్షణలకు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దపండుగ సందర్భంగా అవసరమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్-112, కమిషనరేట్ కంట్రోల్ రూమ్ 8712656597 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సీపీ సూచించారు. శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతో మీలాద్-ఉన్-నబీ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అంబర్ కిషోర్ ఝా కోరారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఆర్ఐ రమేష్, పెద్దపల్లి ఎస్ఐ నరేష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్, చెన్నూర్ టౌన్ ఎస్ఐ శ్యామ్ పటేల్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సాయి--పూజిత కుటుంబానికి ప్రజాసేవ సొసైటీ చేయూత.




**మందమర్రి, ఆగష్టు 24 ( ప్రజాజ్యోతి ):**అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాయి--పూజిత కుటుంబానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ అండగా నిలిచింది. ప్రసిద్ధి, పుట్టినరోజు సందర్భంగా ఆ కుటుంబానికి నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు.టైర్ పంక్చర్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సాయి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు వెంటనే స్పందించారు. రాందేవ్ ట్రేడర్స్ నిఖిల్ సహకారంతో సరుకులను అందించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నందిపాటి రాజ్‌కుమార్, జావిద్ పాషా, పృధ్వి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఉట్నూర్ ,

**ఐ టి డి ఎ కార్యాలయం ముటాడి కార్యక్రమానికి కాసిపేట మండలం నుండి బారిగా వెళ్ళిన ఆదివాసి తూడుందెబ్బ నాయకులు**







**కాసిపేట, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):**ఆదివాసుల సమస్యలను పరిస్కరిశీచలని డిమాండ్ చెస్తు తుడుందెబ్బ ,ఆధివాసిసేన అధ్వర్యాశీలో ఆధివాసి ప్రజలు సోమవారము ఐ టి డి ఎ ఉట్నూర్ కార్యలయన్ని ముటాడించారు. ఐ టి డి ఎ కార్యాలయశీ ఎదురుగా రోడ్ పై బారి నిరసన చెపట్టారు.ఆధివాసి లా హక్కులు,భూముల సమస్యలు పరిస్కరిశీచలని అన్నారు. ఈ సందర్బంగా 1/70 చట్టం, పిసా చట్టం.49 అటావిహక్కుల చట్టం, పోడుభూముల సమస్యలు పరిస్కరిశీచలని నాయకులు డిమాండ్ చేసారు. అనంతరమ్ ఐ టి డి ఎ ప్రాజెక్ట్ అధికారి కి వినతి పత్రాని అందజేసారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేష్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,కాసిపేట మండల అధ్యక్షుడు వెంకటేష్ ,కనకరాజు, అచుత్ రావు, కోడప అనంతరావు , గెడం గణేష్, దౌలాత్ తధితరులు పాల్గొన్నారు..

# పెరుగుతున్న నిత్యావసర ధరలతో సతమతమవుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు

**పెన్షన్‌ను ధరల పెరుగుదలకు అనుగుణంగా పెంచాలి**

**ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి ఆళ వందార్ వేణు మాధవ్**



**మంచిర్యాల, 24, ఆగస్టు ( ప్రజాజ్యోతి):** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పరిమిత పెన్షన్‌పై ఆధారపడుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆళ వందార్ వేణు మాధవ్, ఎర్ర ప్రభాకర్, మహమ్మద్ రఫీక్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, బియ్యం, పప్పులు, పంచదారతో పాటు పాలు, వంట నూనె, మందులు, విద్యుత్, రవాణా తదితర ఖర్చులు పెరగడంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల నెలవారీ బడ్జెట్‌పై తీవ్ర భారం పడుతోందన్నారు.దేశవ్యాప్తంగా ఆహార ధరల ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో పరిమిత ఆదాయంతో జీవిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. జూలై 2026లో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి చేరినట్లు తెలిపారు.కూరగాయల ధరల పెరుగుదలకు అధిక వర్షాలు, అకాల వర్షాలు, ఉష్ణోగ్రతల్లో మార్పులు వంటి వాతావరణ పరిస్థితులు ప్రధాన కారణాలుగా మారుతున్నాయన్నారు. పంటల దిగుబడి తగ్గడం, సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి వంటి వస్తువుల సరఫరాపైనా ప్రభావం పడిందన్నారు.బియ్యం, పప్పుల ధరల పెరుగుదలకు సాగు ఖర్చులు, ఎరువులు, విత్తనాలు, విద్యుత్, నీటిపారుదల, రవాణా వ్యయాలు పెరగడం కూడా కారణమవుతున్నాయని తెలిపారు. రైతు పొలం నుంచి వినియోగదారుడి వంటింటికి చేరే వరకు అనేక దశల్లో ఖర్చులు పెరగడం వల్ల చివరికి రిటైల్ ధరలు అధికమవుతున్నాయని వివరించారు.పంచదార ధరల పెరుగుదల కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. దేశీయ చక్కెర ఉత్పత్తి తగ్గడం, సరఫరా బిగుతుగా మారడం, డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ధరలు పెరిగాయని తెలిపారు. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై ఇంధన వ్యయాలు కూడా ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ట్రాక్టర్లు, నీటిపారుదల పరికరాలు, పంట కోత యంత్రాలు, రవాణా వాహనాలకు అయ్యే ఇంధన ఖర్చులు పెరగడంతో ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతోందన్నారు. ఈ అదనపు భారం చివరికి వినియోగదారుడిపైనే పడుతోందని తెలిపారు.ధరల పెరుగుదలతో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్గాల్లో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఉన్నారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్‌నే ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుని జీవిస్తున్న అనేక మంది ఉద్యోగులు ఉన్నారని, ఒకవైపు పెన్షన్లు స్థిరంగా ఉండగా మరోవైపు నిత్యావసర వస్తువులు, వైద్య ఖర్చులు పెరుగుతుండటంతో జీవనం భారంగా మారిందన్నారు.ముఖ్యంగా వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు తప్పనిసరి కావడంతో మందులు, వైద్య సేవలకు అయ్యే వ్యయం పెరగడం రిటైర్డ్ ఉద్యోగులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందన్నారు. ఉద్యోగ కాలంలో కుటుంబ పోషణకు సరిపోయిన ఆదాయం పదవీ విరమణ తర్వాత అదే స్థాయిలో ఉండదని, అందుకు అనుగుణంగా ఖర్చులు మాత్రం తగ్గడం లేదని తెలిపారు.సింగరేణి సంస్థలో దశాబ్దాల పాటు కష్టపడి పనిచేసి బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ పారిశ్రామిక అభివృద్ధికి సేవలందించిన ఉద్యోగులు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు.నిత్యావసర ధరల పెరుగుదలను కేవలం మార్కెట్ సమస్యగా కాకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాల్సిన అంశంగా పరిగణించాలని కోరారు. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని, మధ్యవర్తుల దోపిడీని అరికట్టాలని, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైన సమయంలో బఫర్ నిల్వలను విడుదల చేసి మార్కెట్‌ను నియంత్రించాలని కోరారు.సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌ను నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా సవరించే విధానంపై ప్రభుత్వం, బొగ్గు సంస్థల యాజమాన్యాలు, సంబంధిత కార్మిక సంఘాలు చర్చించాలని సూచించారు. వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు తగిన ఆర్థిక భద్రత కల్పించడం సమాజం తన పూర్వతరం పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు.ధరలు పెరుగుతున్న సమయంలో పెన్షన్లు స్థిరంగా ఉండటం వల్ల రిటైర్డ్ ఉద్యోగుల వాస్తవ ఆదాయం క్రమంగా తగ్గిపోతోందని, అందువల్ల నిత్యావసర ధరల నియంత్రణతో పాటు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రజావాణి ప్రతి ఫిర్యాదు చట్టపరంగా పరిశీలించి తగిన విధంగా త్వరిత గతిన పరిష్కరించాలి

**.సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో చరవాణిలో ఆదేశాలు జారీ**

**ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలి**

**పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితిక పంత్:బిబి**

**ఆగస్టు24,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి,వారి సమస్యలను విన్నా అనంతరం ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి, తగిన విధంగా, పరిష్కరించేందుకు సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో చరవాణి లో మాట్లాడి, ఫిర్యాదుల స్థితి గతులను తెలుసుకుని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును చట్ట బద్ధంగా, పారదర్శకంగా పరిశీలించి న్యాయ బద్ధమైన పరిష్కారం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు.ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడం, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ కోరారు.



# సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం

**బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి**
**ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం**
**బిఎస్ఎన్ఎల్‌లా మారకుండా క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు**
**భట్టి విక్రమార్క సమర్థవంతమైన నాయకత్వంలో సింగరేణి మరింత బలోపేతంమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**మంచిర్యాల, 24, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రానికి ఆత్మలాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశానిర్దేశం చేస్తూ, కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌ల సాధనలో సంపూర్ణ సహకారం అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికారుల సంఘాల నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. మరో ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులతో కలిసి గట్టి పట్టుదలతో నైనీ కోల్ బ్లాక్‌ను సాధించామని తెలిపారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ-అసైన్ చేసిన తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌కు కేంద్రంతో చర్చించి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. జెన్‌కోను ఒప్పించి వేలంలో మణుగూరు డిప్‌సైడ్-2 బ్లాక్ సింగరేణికి దక్కేలా కృషి చేశామని చెప్పారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి మార్గం సుగమం చేశామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి మార్గాలు విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి బిఎస్ఎన్ఎల్‌లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక బంగారు గని వేలంలో పాల్గొని సింగరేణి దక్కించుకుందని, భవిష్యత్‌లో అక్కడ మైనింగ్ చేపడితే సంస్థకు నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43 వేల నుంచి 45 వేల మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30 వేల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా సంస్థ ముందుకు సాగాలని సూచించారు. వందేళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణిని అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు సహకరించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, చురుకైన నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. భవిష్యత్‌లో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సింగరేణి ప్రతిష్టాత్మకమైన సంస్థ అని, దాని గొప్పతనాన్ని తాను ఎన్నో వేదికలపై ప్రశంసించానని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణికి అత్యంత కీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చర్చించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి రవాణా చేయడం సాధ్యమైందన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ భట్టి విక్రమార్క ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. గత బీఆర్ఎస్ పాలకులు బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు గనులను కోల్పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనేందుకు సింగరేణికి అనుమతి ఇవ్వడంతో ఇటీవల మణుగూరు డిప్‌సైడ్-2 బ్లాక్‌ను సంస్థ దక్కించుకుందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణిని కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్లి అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్‌ను సింగరేణి దక్కించుకోవడం మరో విజయమన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నాయకులు అభినందించారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చారిత్రాత్మకమని, డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందలాది మంది లబ్ధి పొందారని అ న్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, కార్యదర్శి పెద్ది నర్సింహులు, అన్ని ఏరియాలకు చెందిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికారుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో మంత్రుల భేటీ

**సింగరేణి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుంది**
**మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**కార్మికులు, అధికారుల సమస్యల పరిష్కారానికి హామీ**

**మంచిర్యాల, 24, ఆగస్టు (ప్రజా జ్యోతి):** సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, అలాగే అధికారుల సంఘం సీఎంఓఏఐ నాయకులతో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సెక్రటేరియట్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ సింగరేణి ప్రస్తుత పరిస్థితులను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన బొగ్గు గనులను ప్రారంభించాలని, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికులకు సంబంధించిన పెర్క్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని, సొంత ఇంటి కల పథకాన్ని అమలు చేయాలని డా. జనక్ ప్రసాద్ కోరారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు సంబంధించిన పీఆర్‌పీతో పాటు ఇతర సమస్యలను కూడా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణి భవిష్యత్ ప్రయోజనాలకు ప్రాధాన్యంసమావేశం లో ప్రస్తావించిన సమస్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి అభ్యున్నతి, సంస్థ భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు. సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. కార్మికులు,



అధికారుల సమస్యలు పరిష్కరిస్తాం కార్మికులు, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రులు హామీ ఇచ్చారు. సమావేశంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఎంఓఏఐ నాయకులు పాల్గొన్నారు.